మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 80 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad





## ఇతర దేశాల అధినేతలతో మోడీ వరుస భేటీలు

**- జీ7 సదస్సు వేళ ద్వైపాక్షిక అంశాలపై చర్చలు**

రోమ్, జూన్ 14 (ప్రజా మంటలు): ఇటలీలో జరుగుతున్న జీ7 దేశాల సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన ప్రధాని మోడీ ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన ప్రపంచ దేశాధినేతలతో వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. సదస్సుతో సంబంధం లేకుండా వీరిలో విడిగా భేటీ అవుతూ ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరుపుతున్నారు. భారత్ తో ఆయా దేశాల సంబంధాలను మెరుగుపర్చుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలపై చర్చిస్తున్నారు. ప్రధాని మోడీతో భేటీ అయిన వారిలో బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఉన్నారు. ముందుగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ తో భేటీ అయిన ప్రధాని మోడీ.. ఈ భేటీలో



## 'ప్రాణహిత'ను ఎందుకు కాదన్నారు?!

- గ్రావిటీతో నీళ్లొస్తుండగా ఎత్తిపోతలకెందుకెళ్లారు?
- కాళేశ్వరం డిజైన్ ఎవరిదీ?
- గోదావరిలో నీరుండగా ప్రాణహిత కోసం ప్రాజెక్ట్ ఎందుకు ?
- ప్రాణహిత-చేవెళ్ల నిర్మాణం ఎందుకు పక్కన పెట్టారు?
- ఆ ప్రాజెక్టుపై కమిటీ నివేదికను ఇవ్వండి
- మూడు నెలల ఎత్తిపోతలకు వేల కోట్ల ఖర్చెందుకు ?
- కాళేశ్వరంపై జస్టిస్ పిసి ఘోష్ ప్రశ్నల వర్షం

హైదరాబాద్, (ప్రజా మంటలు): ప్రాణహిత – చేవెళ్ల సుజల స్రవంతి ఎత్తిపోతల పథకాన్ని కాదని, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును ఎందుకు చేపట్టారన్న విషయమై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఆరా తీస్తోంది. గ్రావిటీ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉండగా, భారీ వ్యయంతో ఎత్తిపోతలు చేపట్టాల్సిన అవసరం, అందుకు గల కారణాలను అన్వేషించే పనిలో పడింది. ప్రాణహిత – చేవెళ్ల ఎత్తిపోతలతో పాటు మేడిగడ్డ నుంచి నీటిని ఎత్తిపోసే విషయమై ఐదుగురు సభ్యులతో కూడిన విశ్రాంత ఇంజినీర్ల కమిటీ ఇచ్చిన నివేదిక, దానిపై అప్పటి ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఆరా తీస్తోంది.మూడు నెలల వరద నీరు ఎత్తిపోయడానికి ఇంత ఖర్చు అవసరమా..? అని కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. ప్రాణహిత – చేవెళ్లను కాదని కాళేశ్వరం చేపట్టడానికి గల కారణాలు, ఎవరు నిర్ణయం తీసుకున్నారు? ఎందువల్ల ఆ నిర్ణయం తీసుకున్నారన్న విషయాలను నివేదించాలని నీటి పారుదల శాఖను కమిషన్ ఆదేశించింది. గోదావరిలో నీరు ఉండగా, ప్రాణహిత జలాలను ఎత్తి పోయాల్సిన అవసరం ఏమిటన్న విషయమై కూడా కమిషన్ ఆరా తీస్తోంది. ఇప్పటికే మధ్యంతర నివేదిక ఇచ్చిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని తుది నివేదిక ఇవ్వాల్సిందిగా జస్టిస్ పీసీ ఘోష్ ఆదేశించారు. కాళేశ్వరం ప్లానింగ్‌కు సంబంధించి పూణేలోని సీడబ్ల్యూపీఆర్ఎస్ నుంచి కూడా నివేదిక కోరారు. జూలై మొదటి వారంలో నివేదికలు వచ్చే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోంది.విజిలెన్స్ విభాగం నుంచి కూడా తుది నివేదిక కోరారు. మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారణ కొనసాగిస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇవాళ

మిగతా 2లో..



## ధరణిపై ఒకే చట్టం తీసుకొస్తాం

- ప్రక్షాళన దిశగా చర్యలు చేపట్టాం
- పోర్టల్ వల్ల లక్షలాది కుటుంబాలను పీడిస్తున్న భూసమస్యలు
- అందుకోసమే సంస్కరణ చర్యలు
- గత ప్రభుత్వ తీరుతో ఎందరికో నష్టం
- బాధితులందరికీ న్యాయం చేస్తాం
- ధరణి కమిటీ సభ్యులతో మంత్రి పొంగులేటి సమీక్ష

హైదరాబాద్, (ప్రజా మంటలు): గత భారాస ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు భూసమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ సమస్యల నుంచి ఉపశమనం

మిగతా 2లో..

## కమిషన్ ముందుకు మాజీ సీఎం కేసీఆర్

**- విద్యుత్ కొనుగోళ్లపై నేడు వివరణ ఇవ్వనున్న మాజీ సీఎం**



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణలో విద్యుత్ కొనుగోలు,కొత్త ప్రాజెక్టుల నిర్మాణ టెండర్లపై ఎల్ నరసింహారెడ్డి కమిషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు , మాజీ సీఎం కేసీఆర్ ను వివరణ కోరింది. దీంతో ఆయన నిర్ణయంపై ప్రస్తుతం సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే కేసీఆర్‌కు కమిషన్ నోటీస్ జారీ చేసింది. అయితే పార్లమెంట్ ఎన్నికలు ఉన్నందున జులై 30వ తేదీ వరకు వివరణకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే కమిషన్ మాత్రం జూన్ 15వ తేదీ వరకు

మిగతా 2లో..

## ఫోన్ ట్యాపింగ్‌లో మరోమలుపు

**- బీఆర్ఎస్ అభ్యర్థులకు నగదు తరలింపు వెనుక ఐపీఎస్ అధికారి**






హైదరాబాద్, (ప్రజా మంటలు): ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కీలక మలుపులు తిరుగుతోంది. తొలుత స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ)లో ఆధారాల ధ్వంసం ఘటనపై నమోదైన కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారిస్తున్న క్రమంలో ఫోన్ ట్యాపింగ్ అంశం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. మునుగోడు ఉప ఎన్నిక నియమావళి అమల్లో ఉన్న సమయంలోనే నిబంధనలకు విరుద్ధంగా నగదు తరలింపులో పోలీసు అధికారుల పాత్రపై దర్యాప్తు బృందానికి తాజాగా ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ వ్యవహారంలో ఓ ఐపీఎస్‌తోపాటు డీఎస్పీ పాత్రపై దర్యాప్తు బృందానికి ఆధారాలు లభ్యమైనా.. తెరవెనుక

మిగతా 2లో..

## భాజపా ధోరణిపై ఆర్ఎస్ఎస్ గుస్సా

**- నేడు యోగితో మోహన్ భగవత్ భేటి**



న్యూఢిల్లీ, (ప్రజా మంటలు): సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ కీలక వ్యాఖ్యలు చేశారు. నిజమైన సేవకుడు అహంకారంతో ఉండడు. ఎవరికీ ఎటువంటి హాని తలపెట్టడంటూ ఆయన పేర్కొన్నారు. దీంతో మోహన్ భగవత్ వ్యాఖ్యలు తీవ్ర సంచలనం సృష్టించాయి.అయితే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ శనివారం భేటీ కానున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన

మిగతా 2లో..

## ప్రజా నాడి





## కేటీఆర్‌కు హైకోర్టు నోటీసులు

**- ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం**

**- కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం**



హైదరాబాద్, (ప్రజా మంటలు): భారాస ఎమ్మెల్యే కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. నామినేషన్ సందర్భంగా కేటీఆర్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్లలో తప్పుడు సమాచారం ఉందని పేర్కొంటూ కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డి, లగిశెట్టి శ్రీనివాసులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు.. నాలుగు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని కేటీఆర్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి, సిరిసిల్ల రిటర్నింగ్ అధికారికి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

## 24 లక్షల పాఠ్యపుస్తకాలు వెనక్కి

**- బాధ్యులపై చర్యలు - ఇద్దరు అధికారులపై వేటు వేసిన ప్రభుత్వం**



హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలుగు పాఠ్యపుస్తకం ముందు మాటలో తప్పులపై ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల విభాగం డైరెక్టర్ శ్రీనివాసచారి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ రాధారెడ్డిపై చర్యలకు ఆదేశించింది. పాఠ్యపుస్తకాల బాధ్యతల నుంచి శ్రీనివాసచారి, రాధారెడ్డిని తొలగిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్‌గా పాఠశాల విద్య అదనపు డైరెక్టర్ రమేశ్ కు బాధ్యతలు అప్పగించారు. టీఆర్ఈఐఎస్ కార్యదర్శి రమణ కుమార్‌కి ముద్రణ సేవల విభాగం డైరెక్టర్‌గా బాధ్యతలు కేటాయించారు. తెలంగాణలో ఒకటి నుంచి

మిగతా 2లో..

## ఐసెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, (ప్రజా మంటలు): తెలంగాణ ఐసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, కాకతీయ యూనివర్సిటీ ఇంచార్జి వీసీ వాకాటి కరుణ ఇద్దరూ కలిసి శుక్రవారం నాడు ఫలితాలను విడుదల చేశారు. అభ్యర్థులు తమ రిజిస్ట్రేషన్ నెంబర్, హాల్ టికెట్ నెంబర్, బర్త్ డేట్ ఆధారంగా అధికారిక వెబ్ సైట్ లో ఫలితాలను తెలుసుకోవచ్చు. కాగా, ఈ ఫలితాల్లో 91.92 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 5, 6 తేదీల్లో ఐసెట్-2024 ఎగ్జామ్ నిర్వహించారు. ఐసెట్ కోసం మొత్తం 86,156 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 71,647 మంది ఉత్తీర్ణులయ్యారు. ఐసెట్ ఫలితాల కోసం అధికారిక వెబ్‌సైట్ క్లిక్ చేయొచ్చు.

మొదటి పేజీ తరువాయి

# ఫోన్ ట్యాపింగ్‌లో మరోమలుపు

మాత్రం మరికొందరు అత్యున్నతస్థాయి పోలీసు అధికారులున్నట్లు తెలుస్తోంది. వారి మౌఖిక ఆదేశాలకు తలొగ్గిన క్రమంలోనే ఆ ఐపీఎస్ నేతృత్వంలోని బృందం నగదు సరఫరాను పర్యవేక్షించినట్లు సమాచారం. అయితే ఇంతవరకు సిట్ దర్యాప్తు మాత్రం ఐపీఎస్ అధికారి ప్రమేయంపై ఆధారాల సేకరణ వరకే పరిమితమైనట్లు తెలుస్తోంది. దర్యాప్తులో మరింత ముందుకెళ్తే అత్యున్నతస్థాయి అధికారుల పాత్ర నిగ్గు తేలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇంతవరకు సిట్‌కు లభ్యమైన ఆధారాల మేరకు.. 2022 నవంబరు 3న జరిగిన ఉప ఎన్నికలో భారాస (అప్పటి తెరాస) అభ్యర్థి కోసం నిబంధనలకు విరుద్ధంగా డబ్బు సరఫరా చేసేందుకు ఫార్చునర్ వాహనం వినియోగించారు. వాహనానికి ఎస్కార్ట్‌గా వ్యవహరించిన కానిస్టేబుల్ వాంగ్మూలం ఆధారంగా ఈ విషయాన్ని గుర్తించారు. ఆ ఐపీఎస్ అధికారితోపాటు స్పెషల్ బ్రాంచ్ వ్యవహారాలను పర్యవేక్షించిన డీఎస్పీ ఆదేశాలతోనే తాను ఆ వాహనానికి ఎస్కార్ట్‌గా వ్యవహరించినట్లు కానిస్టేబుల్ సిట్ ఎదుట వాంగ్మూలమిచ్చారు. నల్గొండ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన కానిస్టేబుల్ అప్పటి తతంగాన్ని సిట్‌కు పూసగుచ్చినట్లు వివరించారు. మరో ఇద్దరు కానిస్టేబుళ్లు సైతం తమ వాంగ్మూలాల్లో ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. సిట్ తాజా దర్యాప్తులో తేలిన అంశాల మేరకు.. "మునుగోడు ఉప ఎన్నిక సమయంలో నేను నల్గొండ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేశా. ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ నన్ను తన వెంట తీసుకెళ్లారు. 2022 అక్టోబరు 26 నుంచి నవంబరు 2 వరకు (నవంబరు 1న తప్ప) వరుసగా రాత్రి వేళల్లో ఫార్చునర్ వాహనానికి ఎస్కార్ట్‌గా వ్యవహరించా. అదే వాహనంలో తెరాస అభ్యర్థికి సంబంధించిన డబ్బు తరలించారు. అక్టోబరు 31న బహిరంగ సభలో అప్పటి ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఆ సభలో మా డీఎస్పీ ఓ పోలీసు అధికారిని నాకు చూపించారు. అతను అదనపు ఎస్పీ అని.. కేసీఆర్‌తో అతనికి సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. అతని ఆదేశాల మేరకు మనం ఈ డబ్బు సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. తర్వాత ఆ పోలీసు అధికారి నాయిని భుజంగరావు (ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు) అని నాకు తెలిసింది" అని కానిస్టేబుల్ వాంగ్మూలంలో పేర్కొన్నారు.

## ప్రాణహితను ఎందుకు కాదన్నారు

ఈఎన్సీ జనరల్ కార్యాలయం, ఓ అండ్ ఎం విభాగాల ఇంజినీర్లు హాజరయ్యారు. మూడు ఆనకట్టలకు సంబంధించి వారిని విచారణ చేశారు. ఆ వ్యవహారాలకు సంబంధించి వారు నిర్వర్తించిన పాత్ర, సంబంధిత అంశాల గురించి ఆరా తీశారు. దీంతో ఇంజినీర్లకు సంబంధించిన విచారణ దాదాపుగా పూర్తయింది. ఈ నెల 27వ తేదీలోపు అన్ని అఫిడవిట్లు వచ్చాక, 10 రోజుల పాటు పూర్తి స్థాయిలో విశ్లేషించి తదుపరి కార్యాచరణ చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా కాగా కాళేశ్వరంపై జరుగుతున్న న్యాయ విచారణ కమిషన్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. కమిషన్‌కు ఇద్దరు సీనియర్ ఇంజినీర్లను దూరంగా పెట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కమిషన్ సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం. విచారణ ప్రారంభించే ముందుగానే కొందరు ఇంజినీర్లు టెలీ కాన్ఫరెన్స్ పెట్టుకుని కూడబలుక్కున్నట్లు వెలుగులోకి రావడంతో జస్టిస్ పీసీ ఘోష్ తీవ్రంగా పరిగణించారు. ఈ నెల ఏడో తేదీన మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ఇంజినీర్లను కమిషన్ విచారణకు హాజరవ్వాలని పిలిచింది. దీనికి ముందురోజు ఓ ఇంజినీర్ ఇన్?చీఫ్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, కమిషన్ ముందు అందరూ ఒకే రకంగా చెప్పాలని సూచించినట్లు సమాచారం. అందరం ఒకే మాట చెప్పాలి : ఈ కాన్ఫరెన్స్ 45 నిమిషాల పాటు సాగినట్లుగా, అందులో పలు అంశాలు చర్చించినట్లుగా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీనిపై సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్? రెడ్డి ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ కమిషన్ కూడా నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులను పిలిచి ఆరా తీయడంతో ఇది సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇద్దరు సీనియర్ ఇంజినీర్లను కమిషన్ వ్యవహారాలకు దూరంగా ఉంచాలని నీటి పారుదల శాఖ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. ఈ కాన్ఫరెన్స్ 45 నిమిషాల పాటు సాగినట్లుగా, అందులో పలు అంశాలు చర్చించినట్లుగా ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీనిపై సంబంధిత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇంజినీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ కమిషన్ కూడా నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులను పిలిచి ఆరా తీయడంతో ఇది సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఇద్దరు సీనియర్ ఇంజినీర్లను కమిషన్ వ్యవహారాలకు దూరంగా ఉంచాలని నీటి పారుదల శాఖ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.నీటి పారుదల శాఖ న్యాయ విచారణ కమిషన్‌కు సాయంగా నలుగురు నిపుణులతో కూడిన కమిటీని గత నెల 22న ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి ఈఎన్సీ కన్వీనర్‌గా ఉండగా, కమిటీ నుంచి ఈఎన్సీని దూరంగా ఉంచాలని నిర్ణయించినట్లు సంబంధిత వర్గాల సమాచారం. గురువారం పీసీ ఘోష్ నిర్వహించిన సమావేశంలో సైతం ఈఎన్సీ హాజరు కాలేదని తెలిసింది. మరోవైపు ఓ అండ్ ఎం ఈఎన్సీని కూడా కమిషన్ కార్యక్రమాల నుంచి దూరంగా ఉంచేందుకు నిర్ణయించినట్లు తెలుస్తోంది.ఇదిలా ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై జస్టిస్ పీసీ ఘోష్ విచారణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈఎన్సీ జనరల్ కార్యాలయంలోని ఇంజినీర్లు, ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ విభాగంలోని ఇంజినీర్లు నేడు కమిషన్ ముందు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి వారి పాత్ర, సంబంధిత అంశాలపై కమిషన్ వారిని విచారణ చేస్తోంది. అవసరమైన అంశాలపై సమాచారం, వివరాలు సేకరిస్తోంది. అటు కొంతమంది ఇతర వ్యక్తుల నుంచి కూడా కమిషన్ సమాచారం తీసుకుంటోంది. ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై వారి నుంచి వివరాలు సేకరిస్తోంది.

# కమిషన్ ముందుకు మాజీ సీఎం కేసీఆర్

గడువు ఇచ్చింది. ఈ గడువు శనివారంతో ముగియనుండంతో కేసీఆర్ ఏ నిర్ణయం తీసుకుంటారో అన్న విషయం హాట్ టాపిక్‌గా మారింది. ఎన్నికలు ముగియడంతో ఈ అంశంపై లిఖిత పూర్వక వివరణ పంపించేందుకు న్యాయ నిపుణులతో కేసీఆర్ సంప్రదింపులు జరుపుతున్నారు. లిఖిత పూర్వక వివరణ పంపించేందుకు కేసీఆర్ తర్జన భర్జన పడుతున్నట్లు సమాచారం. గడువులోగా ఆయన నుంచి సమాధానం రాకపోతే కమిషన్ ఏ నిర్ణయం తీసుకుంటుందోనన్న విషయంపై ఆశక్తి రేపుతోంది. గడువును పొడిగిస్తుందా? లేక సమన్లు జారీ చేస్తుందా? అన్నది తెలియాలంటే మరో 24 గంటలు ఆగాల్సిందే. కాగా మూడు అంశాల విచారణ కొనసాగుతోందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నోటీసుల్లో పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ఎ÷–లాంట్లపై విచారణ కొనసాగుతోందని అన్నారు. టెండర్ల పక్రియ లేకుండా ఒప్పందాలు జరిగాయని, 25 మందికి నోటీసులు ఇచ్చామని నరసింహారెడ్డి పేర్కొన్నారు. కాగా మాజీ సీఎం కేసీఆర్ మాత్రం ఇంకా సమాధానం ఇవ్వలేదని, సమయం కావాలని కోరారని వివరించారు. మాజీ సీఎండీ, ప్రస్తుత సీఎండీలతో సమావేశం అయ్యామని తెలిపారు. సోమవారం మాజీ సీఎండీ ప్రభాకర్ రావు, నాటి ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ చందాతో సమావేశం అయ్యామని నరసింహా రావు వివరించారు. మూడు నిర్ణయాలు అప్పటి ప్రభుత్వం మాత్రమే తీసుకుందని పవర్ కమిషన్ చీఫ్ జస్టిస్ ఎల్ నరసింహా రెడ్డి పేర్కొన్నారు. జెన్‌కోకు ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఎస్‌కే జోషి, అరవింద్ కుమార్‌లతో మంగళ వారం సమావేశం అయ్యామని చెప్పారు. అరవింద్ కుమార్ అప్పుడే రేగ్యులేటరీ కమిషన్‌కు లేఖ రాశారని, అయితే పట్టించుకోలేదని అన్నారు. రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారం ఇవ్వాలని, అయితే రెండు రాష్ట్రాల ఒప్పందంతో ఛత్తీస్‌ఘడ్‌కు అధికారం ఇచ్చారని పేర్కొన్నారు. భారీగా నిధులు ఖర్చు చేసి పవర్ కొనుగోలు చేశారని, మొత్తం పక్రియలో ఎంత నష్టం అనేది తేల్చాల్సి ఉందని నరసింహా రెడ్డి పేర్కొన్నారు. ఇక భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీని పెట్టారని, అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ పెట్టారని నరసింహా రెడ్డి వివరించారు. యాదాద్రిలో నామినేషన్ బేస్‌లో ఇచ్చారని, ఇంకా పూర్తి కాలేదని అన్నారు. ఆగస్టు వరకు ఒక లైన్ అందుబాటులోకి వస్తుందని అంటున్నారు కానీ రైల్వేలైన్ వెయ్యు లేదని పేర్కొన్నారు. అధికారుల నుంచే కాకుండా ప్రముఖులు నుంచి కూడా సమాచారం తీసుకుంటున్నా మని అన్నారు.

# భాజపా ధోరణిపై ఆర్ఎస్ఎస్ గుస్సా

అనంతరం వీరిద్దరు భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకోనుంది. వీరిద్దరి మధ్య లోక్‌సభ ఎన్నికల ఫలితాలతోపాటు యూపీలో ఆర్ఎస్ఎస్ విస్తరఢ తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశముందని తెలుస్తుంది. అయితే ఈ ఎన్నికల్లో బీజేపీ కేవలం 240 స్థానాలనే గెలుచుకొంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుకు ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు టీడీపీ, జేడీ(యూ) తదితర పార్టీల మద్దతు అవసరమైంది. ఇక 2014,2019 ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మార్క్ అంటే.. 272 స్థానాలను మించి బీజేపీ స్వయంగా గెలుచుకుంది. కానీ ఈ ఎన్నికల్లో బీజేపీ.. తన లక్ష్యం 400 స్థానాలను పెట్టుకున్నప్పటికీ ఆ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. దీకాక ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 లోక్‌సభ స్థానాలుంటే వాటిలో బీజేపీ కేవలం 33 స్థానాల్లో మాత్రమే విజయం సాధించింది. ఇక ఇండియా కూటమిలోని కాంగ్రెస్ పార్టీ, సమాజవాదీ పార్టీలు 42 స్థానాలను గెలుచుకుంది. అదీకాక ఈ ఎన్నికల వేళ బీజేపీ అగ్రనేతలు గర్వంతో ప్రచారం నిర్వహించారని.. అందుకే ఆ పార్టీకి ఎంపీ స్థానాలకు భారీగా కోత పడిందనే అపవాదు పడింది. మరోవైపు గత ఎన్నికల్లో యూపీలో 62 ఎంపీ స్థానాలను బీజేపీ గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారనే ఓ చర్చ సైతం కొనసాగుతుంది.

కమలం అతివిశ్వాసం వల్లే..

మహారాష్ట్రలో భాజపా, శివసేనలకు అసెంబ్లీలో బలం ఉన్నా.. ఎన్సీపీని చీల్చి, అజిత్ పవార్ ను చేర్చుకోవడం తప్పిదమేనంటూ ఆర్ఎస్ఎస్ పత్రిక 'ఆర్గనైజర్'లో ఓ వ్యాసం ప్రచురితమైన విషయం తెలిసిందే.దీనిపై ఎదురైన ప్రశ్నలకు ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ స్పందిస్తూ.. ఈ వ్యవహారంపై తాను మాట్లాడదల్చుకోలేదని స్పష్టంచేశారు. తన దృష్టి అంతా రాష్ట్రం అభివృద్ధి, రాబోయే అసెంబ్లీ ఎన్నికలపైనే ఉందని తెలిపారు."ఎన్నికల అనంతరం అనేకమంది నేతలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో అది వారి హక్కు. వాటిపై స్పందించాలనుకోవడం లేదు. రాష్ట్ర అభివృద్ధిపైనే దృష్టిపెట్టాను. అదేవిధంగా మహాకూటమిగా సరికొత్త శక్తితో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎలా ముందుకెళ్లాలనే దానిపైనే ఆలోచన ఉంది" అని పుణెలో విలేకరులతో మాట్లాడుతూ అజిత్ తెలిపారు. అధికార మహాకూటమిలో భాజపా, శివసేన, ఎన్సీపీలు భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. ఈ ఏడాది అక్టోబరులో మహారాష్ట్రలో శాసనసభ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. అనవసర రాజకీయాలూ లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను దెబ్బతీశాయంటూ.. 'ఆర్గనైజర్'లో ఇటీవల ఓ కథనం వెలువడింది. "మహారాష్ట్రలో పార్టీలను చీల్చడం అనవసరం. భాజపా, శివసేనలకు అసెంబ్లీలో బలం ఉన్నా.. అజిత్ పవార్‌ను చేర్చుకోవడం తప్పిదమే. ఎన్సీపీలో అంతర్గత కలహాల వల్ల శరద్ పవార్ ఎలాగూ రెండు, మూడేళ్లలో కనుమరుగయ్యేవారు. కానీ.. అజిత్‌ను చేర్చుకోవడంతో కమలం పార్టీ కార్యకర్తలు మనస్తాపం చెందారు. ఒక్క దెబ్బతో అక్కడ భాజపా అన్ని పార్టీల్లాగే మారిపోయింది. ఎన్నోఏళ్లు కష్టపడి నిర్మించుకున్న కోట కూలిపోయింది" అని ఆర్ఎస్ఎస్ జీవితకాల సభ్యుడు రతన్ శార్దా వ్యాఖ్యానించారు.

# ఇతర దేశాల అధినేతలతో మోడీ వరుస భేటీలు

ఇరుదేశాల సంబంధాల మెరుగుదల కోసం చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. పలు అంతర్జాతీయ అంశాలపైనా చర్చించినట్లు ట్వీట్ చేశారు. గత ఏడాది కాలంలో ఇది తామిద్దరి మధ్య నాలుగో భేటీ అని మోడీ తెలిపారు. భారత్–ఫ్రాన్స్ మధ్య సంబంధాల బలోపేతానికి తాము ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనం అన్నారు. అలాగే మాక్రాన్‌తో భేటీలో రక్షణ, భద్రత, సాంకేతికత, ఏఐ, బ్లూ ఎకానమీ, వంటి అనేక విషయాలను కవర్ చేసినట్లు ప్రధాని తెలిపారు. యువతలో ఆవిష్కరణలు, పరిశోధనలను ఎలా ప్రోత్సహించాలో కూడా చర్చించామన్నారు. వచ్చే నెలలో ప్రారంభం కానున్న పారిస్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇస్తున్న సందర్భంగా మాక్రాన్ కు మోడీ శుభాకాంక్షలు తెలిపారు.బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్‌తో జరిగిన భేటీ వివరాల్ని కూడా మోడీ ఎక్స్‌లో పంచుకున్నారు. ఇందులో ఇటలీలో మూడవసారి ఎన్డీయే ప్రభుత్వ హయాంలో భారత్–యుకె సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు నా నిబద్ధతను పునరుద్ఘాటించానన్నారు. సెమీకండక్టర్లు, సాంకేతికత, వాణిజ్యం వంటి రంగాలలో సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి గొప్ప అవకాశం ఉందని, రక్షణ రంగంలో సంబంధాలను మరింత పటిష్టం చేసుకోవడం గురించి కూడా మాట్లాడినట్లు మోడీ తెలిపారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీతో జరిగిన భేటీ వివరాలను కూడా మోడీ వెల్లడించారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీతో చాలా మంచి సమావేశం జరిగిందని, ఉక్రెయిన్‌తో ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టం చేసుకునేందుకు భారత్ ఆసక్తిగా ఉందని మోడీ తెలిపారు. రష్యా–ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యద్ధం గురించి, భారతదేశం మానవ–కేంద్రీకృత విధానాన్ని విశ్వసిస్తుందని చర్చలు, దౌత్యం ద్వారా శాంతికి మార్గమని విశ్వసిస్తుందని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు. దక్షిణ ఇటాలియన్ ప్రాంతంలోని అపులియాలో మూడు రోజుల జీ7 సమ్మిట్‌లో రెండోరోజు శుక్రవారం ఇవాళ ఇండో–పసిఫిక్, ఆర్థిక భద్రత తర్వాత వలసల సమస్యలపై ప్రపంచంలోని ఏడు ప్రముఖ పారిశ్రామిక దేశాల బృందం చర్చించింది.

**ఉక్రెయిన్ వివాదంపై శాంతియుత పరిష్కారం కోసం కృషిచేస్తాం**

ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కార మార్గానికి భారత్ తన శక్తి మేరకు అన్ని విధాలా ప్రయత్నిస్తుందని ప్రధాని మోడీ అన్నారు. శాంతికి 'సంభాషణ , దౌత్యం' మాత్రమే మార్గమని శుక్రవారం ఉక్రేనియన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్ స్కీ కి ప్రధాని నరేంద్ర మోడీ తెలియజేశారు. ఇటలీలోని అపులియా ప్రాంతంలో జి–7 శిఖరాగ్ర సదస్సు సందర్భంగా మోడీ, జెలెన్స్కీని కలిశారు. భారతదేశం మానవ–కేంద్రీకృత విధానాన్ని విశ్వసిస్తుందని కూడా ప్రధాన మంత్రి జెలెన్స్కీకి చెప్పారు. ఉక్రెయిన్‌లో పరిస్థితి, స్విట్జర్లాండ్‌లో జరగనున్న శాంతి సదస్సుపై ఇరువురు నేతలు పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నారు.

# 24 లక్షల పాఠ్యపుస్తకాలు వెనక్కి

పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసిన తెలుగు వాచకం పాఠ్య పుస్తకాలను వెనక్కి తీసుకోనున్నారు. పంపిణీ చేయని వాటిని పిల్లలకు ఇవ్వకుండా నిలిపివేశారు. 24 లక్షల పుస్తకాల్లోని ముందుమాటలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు, అధికారుల పేర్లను ముద్రించారు. ఏళ్ల క్రితం నాటి ముందుమాటలో మార్పులు చేయకుండా రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్సీఈఆర్టీ) అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహించారు. బుధవారం పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్న సమయంలో ముందుమాటలోని తప్పులను చాలాచోట్ల ఉపాధ్యాయులు గుర్తించి విద్యాశాఖ దృష్టికి తీసుకొచ్చారు. తొలుత ఆ పేజీని చించేయాలని ఆదేశించిన అధికారులు తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఆ పేజీని తొలిగిస్తే దాని వెనుకున్న వందేమాతరం, జాతీయ గీతం, ప్రతిజ్ఞ లేకుండా పోతాయి. అప్పుడు మరిన్ని విమర్శలు వస్తాయని భావించారు. దాంతో పిల్లలకిచ్చిన, ఇవ్వని పుస్తకాలన్నీ వెనక్కి తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన డీఈఓలను ఆదేశించారు. వాటిని మండల వనరుల కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఆ పేజీ మొత్తం కనిపించకుండా స్టిక్కర్ వేసి అందజేయనున్నారు. తెలుగు వర్క్ బుక్స్‌నూ వెనక్కి తీసుకుంటున్నారు.

# ముందుమాట పేజీ మాత్రమే మార్పు

## - పుస్తకాలను తిరిగి ముద్రించడం లేదు
## - కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వివరణ

హైదరాబాద్, (ప్రజా మంటలు):

పాఠ్యపుస్తకాల వివాదంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వివరణ ఇచ్చారు. కేవలం ముందుమాట పేజీ మార్చి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పుస్తకాలను మళ్లీ ముద్రిస్తున్నామనే ప్రచారంలో నిజం లేదన్నారు. దీనివల్ల ప్రభుత్వంపై ఎలాంటి భారం పడదని స్పష్టం చేశారు. విద్యార్థులకు తప్పుడు సమాచారం వెళ్లకూడదనే ఈ రకమైన నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలోని విద్యార్థులకు అందజేసిన పాఠ్యపుస్తకాల్లో ముద్రితమైన మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి పేర్లను తొలగించాలని తాజాగా సర్కారు నిర్ణయించింది. ఈ పేర్లున్న పేజీపై మరో పేజీని అతికించి ఇవ్వాలని ఆదేశాలిచ్చింది. గమ్ స్టిక్కర్లు ఉన్న పేజీని ఆ పేజీపై అతికించనున్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. గతంలో ఇలాగే పొరపాటు జరిగినప్పుడు పేజీని అతికించామని, ఇప్పుడు అలాగే చేయనున్నట్టు ఆయా వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతుల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేసిన విషయం తెలిసిందే. దాదాపు ఈ పుస్తకాల సంఖ్య 25లక్షల వరకు ఉంటుంది. ఈ పుస్తకాల్లోని ముందుమాట లో కేసీఆర్ సహా మాజీ మంత్రుల పేర్లను ప్రస్తావించారు. ఈ విషయం సోషల్‌మీడియాలో రావడంతో ఏదో తప్పు జరిగిందన్నట్టుగా పాఠశాల విద్యాశాఖ ఆగమేఘాల మీద ఆయా పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ఆదేశించింది. అన్ని పాఠ్యపుస్తకాలను వెనక్కి తీసుకోవాలని విద్యాశాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. పుస్తకాలను ఎమ్మార్సీలో అందజేయాలని, ఎంఈవోలు వాటిని జిల్లా పుస్తకాల గోడౌన్‌లో వాపస్ చేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నది. ఇది అత్యంత ముఖ్యమైన అంశమని ప్రస్తావించింది. కొన్ని ప్రాంతాల్లో ఆయా పేజీని చింపివేయాలని మంగళవారం మౌఖిక ఆదేశాలిచ్చారు. ఇదే పేజీ వెనక వందేమాతరం, జనగణమన లుండటం, వాటిని అవమానం జరుగుతుందన్న అభ్యంతరాలు టీచర్ల నుంచి రావడంతో ఆఖరుకు పేజీని అతికించాలని నిర్ణయించారు.

# కవితను కలిసేందుకు తీహార్ జైలుకు కేటీఆర్

న్యూఢిల్లీ, (ప్రజా మంటలు):

తీహార్ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కవితతో ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ములాఖత్ అయ్యారు. కవిత యోగ క్షేమాలను ఆయన అడిగి తెలుసు కున్నారు. ఢిల్లీ మద్యం పాలసీ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన కవిత ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నారు. కవితను బయటకు తీసుకురావడం కోసం ఆమె కుటుంబం ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూనే ఉంది కానీ ఆ ప్రయత్నాలన్నింటికీ దర్యాప్తు సంస్థలు బ్రేకులు వేస్తూనే ఉన్నాయి. ఎప్పుడు బెయిల్ కోసం ఆమె తరుపు న్యాయవాదులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినా కూడా దర్యాప్తు సంస్థలు కొత్త విషయాలను వెలుగులోకి తీసుకు వస్తున్నారు. దీంతో బెయిల్ వాయిదా పడుతూనే ఉంది.



# ధరణిపై ఒకే చట్టం తీసుకొస్తాం

కలిగించడానికే ధరణి పోర్టల్‌ను పునర్వ్యవస్థీకరించి, భూ వ్యవహారాలకు సంబంధించిన చట్టాల్లో మార్పులు తేవాల్సిన అవసరమేర్పడిందన్నారు. ఆ దిశగా ఇప్పటికే చర్యలు చేపట్టామని తెలిపారు.సచివాలయంలోని తన ఛాంబర్‌లో ధరణి కమిటీ సభ్యులతో మంత్రి పొంగులేటి సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'గత ప్రభుత్వం హడావుడిగా ఎలాంటి అధ్యయనం చేయకుండా ఈ పోర్టల్‌ను తీసుకొచ్చింది. దీంతో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారు. వాటిని పరిష్కరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ధరణిని ప్రక్షాళన చేసేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నాం. ఈ పోర్టల్ అమలు కారణంగా వచ్చిన సమస్యలను అధ్యయనం చేసేందుకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేశాం. ఈ కమిటీ ఇచ్చిన సిఫారసులపై సమావేశంలో చర్చించాం. కమిటీ తుది నివేదిక ప్రభుత్వానికి ఇచ్చే ముందే అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తాం"అని తెలిపారు. ఈ కమిటీ రాష్ట్రంలో భూసంబంధిత నిపుణులు, అధికారులతో చర్చించడంతోపాటు 18 రాష్ట్రాల్లోని ఆర్‌వోఆర్ యాక్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిందని మంత్రి తెలిపారు. భూ వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ ట్రైబ్యునల్‌లను ఏర్పాటు చేయాలని, భూమికి సంబంధించిన ముఖ్యమైన చట్టాలను కలిపి ఒకే చట్టంగా రూపొందించాలని కమిటీ సూచించినట్లు చెప్పారు. ధరణి పోర్టల్‌ను బలోపేతం చేయడంతోపాటు సామాన్య ప్రజలకు అందుబాటు లో ఉండేలా, అందరికీ సులువుగా అర్థమయ్యే విధంగా మార్పులు చేపట్టబోతున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం పార్ట్–బిలో ఉంచిన భూ సమస్యలను పరిష్కరించానికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు.

# రుణమాఫీ అందరికి వర్తింప చేయాలి

## - మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్

హైదరాబాద్, (ప్రజా మంటలు):



ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి యోజన ప్రాతిపదికగా ప్రభుత్వం రుణమాఫీ అమలు నిర్ణయంపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఫైర్ అయ్యారు. రుణమాఫీ అందరికీ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వ ఆంక్షలు గర్హనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం మూడు విడుతల్లో ఇచ్చేది రూ.6 వేలు మాత్రమేనన్నారు. రాష్ట్రంలో 70 లక్షల మందికిపైగా రైతులు ఉండగా, కేంద్రం గరిష్టంగా 36.1 లక్షల మంది రైతులకే అమలు చేసిందని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇచ్చామని చెప్పారు. ఇందులో భాగంగా 11 విడుతల్లో రైతుల ఖాతాల్లో రూ.72,910 కోట్లు జమచేశామని తెలిపారు. యాసంగిలో ఎకరాకు రూ.5 వేలు అరకొరగా ఇచ్చి కాంగ్రెస్ సర్కార్ చేతులు దులుపుకున్నదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని తెలిపారు. సాగునీళ్లు, కరెంటు, పంటల కొనుగోళ్లలో రైతాంగాన్ని ఇబ్బందిపెడుతున్నారని ఆరోపించారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసినందుకు ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఎకరం భూమి కోసం పచ్చటిపొలంలో నెత్తురు పారింది

## - దయాదుల చేతిలో వ్యక్తి దారుణ హత్య



నారాయణపేట జిల్లా బ్యూరో (ప్రజా మంటలు):

నారాయణపేట జిల్లా ఉట్కూర్ మండలం చిన్న పోర్ల గ్రామంలో దారుణం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం దాయాదుల చేతిలో సంజీవ్ అనే వ్యక్తి దారుణ హత్యకు గురయ్యారు. 2 ఎకరాల భూమి తగాదాతో దాయాదులు మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. అయితే చిన్న సవరప్ప,పెద్ద సవరప్ప సంజీవ్ ట్రాక్టర్ తో పొలం దున్ని వస్తుండగా వారిదాయాడులు 7 మంది కర్రలు రాళ్లతో దాడికి దిగారు చిన్న సవరప్ప,పెద్ద సవరప్ప లకు రక్తం గాయాలు కాగా సంజీవ్ తీవ్ర గాయాలతో కుప్పకూలారు.చనిపోయాడని భ్రమించి వెళ్ళిపోయారు. ఈ సంఘటనపై పోలీసులు కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆరేళ్ల బాలికపై అత్యాచారం.. హత్య

## – పెద్దపల్లి జిల్లాలో ఘటన

పెద్దపల్లి (ప్రజా మంటలు):



ఆరేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటన పెద్దపల్లి జిల్లాలో చోటు చేసుకుంది. బాలికపై ఓ రైస్‌మిల్లు డ్రైవర్ బలరామ్ గురువారం రాత్రి అత్యాచారం చేసి హత్య చేశాడు.మిల్లులో తల్లితో పాటు నిద్రిస్తున్న బాలికను ఎత్తుకెళ్లి ఘాతుకానికి పాల్పడ్డాడు. సమీప పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి చంపేశాడు. అర్ధరాత్రి బాలిక లేదని గుర్తించిన తల్లి, తోటి కార్మికులు పరిసరాల్లో వెతికారు. అనంతరం నిందితుడిని గుర్తించి పోలీసులకు అప్పగించారు. బాలిక మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

### పెద్దపల్లి, నారాయణపేట ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్

**- లా అండ్ ఆర్డర్ పట్ల కఠినంగా వ్యవహరించాలి - డీజీపీ రవి గుప్తాకి ముఖ్యమంత్రి ఆదేశాలు**

హైదరాబాద్ (ప్రజా మంటలు):



తెలంగాణలో లా అండ్ ఆర్డర్ పట్ల కఠినంగా వ్యవహరించాలని డీజీపీ రవి గుప్తాకి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు చేశారు. పెద్దపల్లి జిల్లాలో జరిగిన మైనర్ రేప్ ఘటనపై పూర్తి స్థాయి ఇన్వెస్టిగేషన్ చేయాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేశారు. ఫోక్స్ చట్టంతో పాటు కేసు విచారణ త్వరగా చేసి ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని చెప్పారు. నిందితునికి కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. నారాయణపేట ఉట్కూర్‌లో జరిగిన హత్యపైనా సీఎం రేవంత్ ఆరా తీశారు. పోలీసుల నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. ఉట్కూరులో వ్యవహారంపై దర్యాప్తు చేసి నిందితులకు శిక్షపడేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

# షరతులకు అంగీకరిస్తే కాల్పుల విరమణ

## - ఉక్రెయిన్‌కు రష్యా ఆఫర్

మాస్కో (ప్రజా మంటలు):

గత రెండేళ్లకు పైగా ఎలాంటి ముగింపు లేకుండా ఉక్రెయిన్–రష్యా యుద్ధం జరుగుతోంది. ఈ తరుణంలో రష్యా అధ్యక్షుడు పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. కాల్పుల విరమణకు ఆదేశిస్తానంటూ ఉక్రెయిన్‌కు ఆఫర్ ఇచ్చారు. అయితే అందుకు రెండు షరతులు విధించారు. రష్యా విదేశాంగ శాఖ కార్యాలయంలో పుతిన్ మాట్లాడుతూ.. "మేం వెంటనే కాల్పుల విరమణ చేస్తాం" అని అన్నారు. కాల్పుల విరమణకు ఆదేశాలతో పాటు చర్చలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. తమ స్వాధీనంలో ఉన్న నాలుగు ప్రాంతాల్లో బలగాలను ఉపసంహరించుకోవాలని, నాటోలో చేరాలన్న ఆలోచనను విరమించుకోవాలని కీవ్‌కు షరతు విధించారు. తుది పరిష్కారం కోసం ఈ ప్రతిపాదన తెచ్చినట్లు, ఎలాంటి ఆలస్యం లేకుండా చర్చలు ప్రారంభిస్తామని చెప్పారు. అయితే ఒకవైపు జీ7 దేశాలు ఇటలీలో సమావేశమైన తరుణంలో ఈ ప్రకటన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఉక్రెయిన్‌కు చెందిన దొనెట్స్క్, లుహాన్స్క్, ఖేర్సన్, జపోరిజియా ప్రాంతాలు తమ దేశంలో విలీనమైనట్లు గతంలో రష్యా ప్రకటించింది. అయితే, ఈ చర్యను ఉక్రెయిన్, పశ్చిమదేశాలు ఖండించాయి. రష్యా దళాలు ఆక్రమించి విలీనం చేసుకున్న ఆ నాలుగు ప్రాంతాలతో పాటు 2014లో స్వాధీనం చేసుకున్న క్రిమియాను కూడా వదిలివెళ్లాలని ఉక్రెయిన్ డిమాండ్ చేస్తోంది. ప్రస్తుతం నాటోలో చేరే దిశగా అడుగులు వేస్తోన్న తరుణంలో... రష్యా ఇచ్చిన ఆఫర్ ఉక్రెయిన్‌కు రుచించకపోవచ్చు.

# నీట్ అక్రమాలపై మోడీ మౌనమేళా

- అవకతవకలు జరిగితే విచారణ జరపరా
- స్కాంపై మరోమారు విరుచుకుపడ్డ కాంగ్రెస్
- ఈ కుంభకోణానికి ముగింపు పలకాలి: ఎంకే స్టాలిన్

న్యూఢిల్లీ (ప్రజా మంటలు):



దేశంలో వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన 'నీట్– యూజీ 2024 'పై పెద్దఎత్తున వివాదం చెలరేగుతున్న వేళ..కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా దీనిపై కాంగ్రెస్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. ఈ వ్యవహారంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఫోరెన్సిక్ విచారణెలి.. లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును కాపాడుతుందని ఉద్ఘాటించింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీల ద్వారా మోదీ ప్రభుత్వం నీట్ కుంభకోణాన్ని కప్పిపుచ్చడం ప్రారంభించిందని ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ కానప్పుడు.. బిహార్‌లో పేపర్ లీక్ పేరిట 13 మందిని ఎందుకు అరెస్టు చేశారని ప్రశ్నించారు. గుజరాత్‌లోని గోధ్రాలో చీటింగ్ రాకెట్ గుట్టురట్టు కాలేదా? మోదీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తోందా? దాదాపు 24 లక్షల మంది యువత ఆకాంక్షలను తుంగలో తొక్కింది. ఎన్‌టీఏను దుర్వినియోగం చేసింది. మార్కులు, ర్యాంకులను భారీగా రిగ్గింగ్ చేసింది. దీంతో రిజర్వ్‌డ్ సీట్లకు కటాఫ్ కూడా పెరిగింది. మెరిట్ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పొందకుండా చేసేందుకే కేంద్రం ఈ ఆటలాడినట్లు కనిపిస్తోందఅని ఖర్గే ఆరోపించారు. మోదీ పాలనలో 'నీట్' కూడా చీట్ లా కనిపిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ విమర్శించారు. నీట్ వ్యవహారం.. 'వ్యాపమ్ 2.0' అని పార్టీ మీడియా ఇన్‌ఛార్జి పవన్ ఖేడా విమర్శలు చేశారు. ఈ వ్యవహారంలో నిరసనలు, కోర్టు కేసులు, విద్యార్థుల ఆగ్రహాన్ని ప్రేరేపిత చర్యలుగా కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారని ఆరోపిస్తూ.. ఇది 24 లక్షల మంది ఆశావహుల పుండుపై కారం చల్లినట్లే ఉందని, వారి భవిష్యత్తును భాజపా నాశనం చేస్తోందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో ఉన్నప్పుడు ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఇదిలాఉండగా.. 2013లో మధ్యప్రదేశ్‌ను వ్యాపమ్ కుంభకోణం కుదిపేసింది. ఉద్యోగ నియామకాల్లో బయటపడిన మోసాలు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపాయి.

**నీట్ కుంభకోణానికి ముగింపు పలకాలి: ఎంకే స్టాలిన్**

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) కుంభకోణానికి ముగింపు పలకాలని తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే నేత ఎంకే స్టాలిన్(ఓఐ ాబిజీశ్రీతిని) శుక్రవారం అన్నారు.చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సీఎం స్టాలిన్ మాట్లాడుతూ "ఎవరూ మన దగ్గర దోచుకోలేని ఏకైక ఆస్తి చదువు.. కానీ అందులోనూ నీట్ లాంటి మోసాలు ఉన్నాయి. అందుకే దీన్ని వ్యతిరేకిస్తున్నాం. నీట్‌లో అక్రమాలు జరుగుతున్నాయని తమిళనాడు మొదట చెప్పింది.. ఇప్పుడు దేశం మొత్తం దీనిని సమర్థిస్తోంది. ఎటువంటి ఆర్థిక, రాజకీయ పరిస్థితులు విద్యార్థుల చదువుకు అడ్డంకి కాకూడదు" అని అన్నారు.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ సోషల్ మీడియా పోస్ట్‌లో "నీట్ అభ్యర్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు కేంద్రప్రభుత్వం కట్టుబడి ఉంది. విద్యార్థులు దేనికోసం ఆందోళనలు చేపడుతున్నారో వాటిని న్యాయంగా పరిష్కరిస్తామని నేను వారికి హామీ ఇస్తున్నాను. ఏ విద్యార్థికీ నష్టం జరగదు. వారి భవిష్యత్తు ప్రమాదంలో పడదు" అని వ్యాఖ్యానించారు.2024లో నీట్–యూజీ 1,563 ఇచ్చిన గ్రేస్ మార్కులను తీసేస్తామని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. జూన్ 23న వారికి మళ్లీ పరీక్ష రాసే అవకాశాన్ని కల్పిస్తామని పేర్కొంది. జూన్ 30లోగా ఫలితాలు విడుదల చేస్తామని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఔుం) హామీ ఇచ్చింది.

# సీబీఐ విచారణ జరిపించండి

## - నీట్ అవకతవకలపై సుప్రీంలో మరో పిటిషన్ దాఖలు

## - జూలై8న అన్నీ కలిపి విచారిస్తామన్న ధర్మాసనం

న్యూఢిల్లీ (ప్రజా మంటలు):



ఎంబీబీఎస్, బీడీఎస్.. ఇతర వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్)– యూజీ 2024పై పెద్ద ఎత్తున వివాదం చెలరేగిన క్రమంలో, దీనిపై సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. నీట్ పరీక్షలో పేపర్ లీక్, ఇతర అక్రమాలపై సీబీఐ దర్యాప్తు చేపట్టాలని పిటిషనర్ అభ్యర్థించారు. ఈ విచారణ సందర్భంగా కోటా ఆత్మహత్యల ప్రస్తావన తీసుకురాగా.. సర్వోన్నత న్యాయస్థానం సున్నితంగా మందలించింది. నీట్ పరీక్షలో అక్రమాల ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన ఓ న్యాయవాది.. రాజస్థాన్‌లోని కోటా నగరంలో విద్యార్థుల వరుస ఆత్మహత్యల అంశాన్ని ప్రస్తావించారు. దీనికి ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. కోటాలో ఆత్మహత్యలకు నీట్ యూజీ 2024 ఫలితాలతో సంబంధం లేదు. ఇలాంటి అనవసర, భావోద్వేగ వాదనలు ఇక్కడ చేయొద్దని సూచించింది. అనంతరం ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా తమ స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి సుప్రీం నోటీసులు జారీ చేసింది. వీటితో పాటు సీబీఐ, బిహార్ ప్రభుత్వానికి కూడా ధర్మాసనం నోటీసులిచ్చింది. దీనిపై తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. నీట్ పరీక్షకు సంబంధించి దాఖలైన ఇతర పెండింగ్ పిటిషన్లతో కలిపి దీన్ని విచారిస్తామని స్పష్టం చేసింది. బిహార్‌లో నీట్ ప్రశ్నాపత్నం లీకైనట్లు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే.ఈ ఏడాది నీట్ ప్రవేశ పరీక్ష మే 5న దేశవ్యాప్తంగా 4,750 కేంద్రాల్లో జరిగింది. దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులు సాధించారు. హరియాణాలోని ఒకే పరీక్షా కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు తొలి ర్యాంక్ రావడంతో అనుమానాలు తలెత్తాయి. ఇంత మంది టాప్ ర్యాంకును పంచుకోవడం వెనుక గ్రేస్ మార్కులు కారణమని ఇటీవల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలోనే 1563 మంది విద్యార్థులకు కేటాయించిన గ్రేస్ మార్కులను రద్దు చేస్తున్నట్లు కేంద్రం సుప్రీంకోర్టు తెలిపింది. 2019 నుంచి ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఏకంగా 67 మందికి 720కి 720 మార్కులు రావడం, టాపర్లుగా నిలవడంతో నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలు మొదలయ్యాయి. ఇప్పటివరకు నీట్ యూజీలో ఒక్కసారి కూడా ముగ్గురికి మించి టాపర్లు లేరు. 2019, 2020లో ఒక్కొక్కరు చొప్పున టాపర్లుగా నిలిచారు. 2021లో ముగ్గురు, 2022లో ఒక్కరు, 2023లో ఇద్దరు టాప్ స్కోరు సాధించారు. కానీ, ఈసారి అసాధారణ రీతిలో 67 మంది టాపర్లుగా నిలవడం, వీరిలో హర్యానాలో ఒకే సెంటర్‌లో పరీక్ష రాసిన ఆరుగురు ఉన్నారనే వార్తలు రావడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో అనుమానాలు మొదలయ్యాయి. ఈ అంశంపై విద్యార్థులు దేశవ్యాప్తంగా పలు చోట్ల ఆందోళనలు చేపట్టారు.



# వయనాడ్ బరిలో ప్రియాంక!

- కసరత్తు చేస్తున్న కాంగ్రెస్ నేతలు
- ఎంపీ స్థానాన్ని వదులుకోనున్న రాహుల్?

న్యూఢిల్లీ (ప్రజా మంటలు):

మొన్నటి సార్వత్రిక ఎన్నికల ఫలితాల తరవాత కాంగ్రెస్‌లో మరోమారు ఆశలు చిగురిస్తున్నాయి. కొంచెం కష్టపడితే మోడీని గద్దె దించవచ్చన్న ధీమాలో ఉన్నారు. ఇప్పుడున్న ఎన్‌డిఎ పక్షాలను లాగితే ప్రభుత్వం తమే అన్న ఆలోచనలో కాంగ్రెస్ అగ్రనేతలు ఉన్నారు. మరోవైపు ప్రియాంకను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకని వచ్చే ప్రయత్నాలు దాదాపుగా ఖరారు అయ్యాయి. రాహుల గాంధీ వయనాడ్‌కు రాజీనామా చేస్తే అక్కడ ప్రియాంకను నిలబెట్టేందుకు కసరత్తు జరుగుతున్నట్లు సమచారం. వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ ఈ స్థానానికి రాజీనామా చేయనున్నారని, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఇదే హాట్ టాపిక్‌గా మారింది. కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా ఎన్నికైన రాహుల్ గాంధీ.. ఆ స్థానానికి ఇవాళో, రేపో రాజీనామా చేస్తారనే ప్రచారం నడుస్తోంది. దీనిపై రాహుల్ గాంధీ త్వరలోనే తన నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. టీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ రెండు చోట్ల నుంచి పోటీ చేశారు. కేరళలోని వయనాడ్, ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీ రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లోనూ రాహుల్ ఎంపీగా పోటీ చేశారు. ఈ రెండు చోట్లా రాహుల్ భారీ మెజార్టీతో గెలుపొందారు. అయితే, నిబంధన ప్రకారం.. ఎన్నికల ఫలితాలు విడుదలైన రెండు వారాల్లో ఏదో ఒక స్థానానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. దీంతో రాహుల్ గాంధీ వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాజీనామా చేస్తారని తెలుస్తోంది. ఇటీవల వయనాడ్ నియోజకవర్గంలో పర్యటించారు రాహుల్.. వయనాడ్, రాయబరేలీ నియోజకవర్గ ప్రజలకు సంతోషంగా ఉండే నిర్ణయం తీసుకుంటానని ప్రకటించారు. మరి రాహుల్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై ఉత్కంఠ నెలకొంది. రాహుల్ గాంధీ వయనాడ్ పార్లమెంట్ స్థానానికి రాజీనామా చేస్తే ఆ చోటు నుంచి ఎవరు పోటీ చేస్తారనే చర్చ కూడా అప్పుడే ప్రారంభమైంది. వయనాడ్ నియోజకవర్గానికి రాహుల్ రిజైన్ చేస్తే.. అక్కడి నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. లేదంటే కేరళకు చెందిన సీనియర్ నేతను అక్కడి నుంచి పోటీకి దించే అవకాశం కూడా ఉందంటున్నారు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడాలంటే యూపీలో కాంగ్రెస్ పుంజుకోవడం అనివార్యం. అందుకే.. రాహుల్ గాంధీ రాయబరేలీ స్థానంలోనే కొనసాగాలని యూపీ కాంగ్రెస్ నేతలు పట్టుబడుతున్నారు. దీంతో రాహుల్ సైతం రాయబరేలీ వైపే మొగ్గు చూపుతున్నారు. దీనిపై ఒకటి రెండు రోజుల్లోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఈ క్రమంలో తాజాగా ప్రియాంకా వయనాడ్ నుంచి బరిలోకి దిగుతారని ప్రచారం జరుగుతున్నది. రాహుల్ తన సోదరి కోసం వయనాడ్ స్థానానికి రాజీనామా చేయనున్నారని, దీంతో అక్కడ జరిగే ఉపఎన్నికలో ప్రియాంక పోటీచేస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి.2019లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ప్రియాంక.. అప్పుడు జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వారణాసి నుంచి ప్రధాని మోదీపై పోటీచేస్తారని ప్రచారం జరిగింది. అమెకు కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ఇవ్వకపోవడంతో అదంతా ఒట్టి ప్రచారమేనని తేలిపోయింది. తర్వాత 2022లో జరిగిన ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచార బాధ్యతలను తన భుజాలపై వేసుకున్నారు. విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తానే ముఖ్యమంత్రి అభ్యర్థినంటూ పేర్కొన్నారు కూడా. కానీ, తర్వాత ఆ మాటలను వెనక్కి తీసుకున్న ఆమె.. ఎన్నికల్లో పోటీచేయడం లేదని ప్రకటించారు. ఇక తాజాగా జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తన తల్లి సోనియా గాంధీ ఇన్నాళ్లూ ప్రాతినిథ్యం వహించిన రాయ్‌బరేలి నుంచి పోటీచేస్తారని అంతా అనుకున్నారు. కానీ అక్కడ రాహుల్ పోటీచేసి విజయం సాధించారు. అయితే కేరళలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాహుల్.. వయనాడ్‌ను అట్టిపెట్టుకుని రాయ్‌బరేలి స్థానానికి రాజీనామా చేస్తారనే ప్రచారమూ జరిగింది. అయితే ఇప్పుడు వయనాడ్‌పూ ఆయన వదిలిపెడతారని చర్చ జరుగుతున్నది. దీంతో ఇక్కడ ప్రియాంకను నిలబెట్టి దక్షిణాదిలో మరింతగా ప్రచారం చేయాలని చూస్తున్నారు.

# ఆరుగురు అధికారుల అరెస్టు

## - గొర్రెల పంపిణీ స్కామ్‌లో ఈడీ దూకుడు

హైదరాబాద్ (ప్రజా మంటలు):

గొర్రెల పంపిణీ స్కామ్‌పై ఈడీ దూకుడు పెంచింది. ఇప్పటికే ఈ కేసులో ఆరుగురు అధికారులు అరెస్టు అయ్యారు. ఇప్పుడు ఈడీ జోక్యంతో ఇంకా ఎలాంటి పరిణామాలు జరుగుతాయో అన్న ఆసక్తి నెలకొంది. ఈడీ కేసు నమోదు చేసి 24 గంటలు కాకముందే తెలంగాణలోకి ఎంట్రీ ఇచ్చారు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు. గొర్రెల పంపిణీ స్కామ్‌లో కేంద్రంగా మారిన పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఇప్పటికే ఆ శాఖ అధికారులకు లేఖ రాసిన ఈడీ అధికారులు... పలు వివరాలు సేకరించే పనిలో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగినట్టు తేల్చింది. అవినీతి నిరోధక శాఖను రంగప్రవేశంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెయ్యికోట్లకుపైగా అవినీతి జరిగినట్టు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి ఆరుగురు అధికారులను అరెస్టు చేశారు. ఏసీబీ దర్యాప్తు ఆధారంగా ఇందులో మనీలాండరింగ్ జరిగినట్టు నిర్ధారించుకున్న తర్వాత ఈడీ జోక్యం చేసుకొని కేసు నమోదు చేసింది. దీంతో ఇది ఎవరి మెడకు చుట్టుకుంటుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



## సంపాదకీయం

# అవినీతి నేతలను బోనులో నిలబెట్టాల్సిందే

తెలంగాణలో 700 కోట్ల గొర్రెల పంపిణీ స్కామ్ వ్యవహారం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోంది. ఇడి రంగంలోకి దిగుతుందన్న వార్తల నేపథ్యంలో గత కెసిఆర్ పాలన ఎంత అధ్వాన్నంగా,అక్రమంగా, అవినీతి మయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. మసిపూసి మారేడుకాయ చేసి, తెలంగాణ ధనిక రాష్ట్రం అంటూ ప్రగల్భాలు పలికిన కెసిఆర్, ఆయన అనుచరగణం అవినీతి వ్యవహారాలపై కుక్కిన పేనుల్లా ఉన్నారు. కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, గొర్రెల పంపిణీ ఇలా అనేక పథకాలన్నీ అవినీతికి ఆలవాలంగా ఉన్నాయి. ఇక ఫోన్ ట్యాపింగ్ గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇలాంటివే రేపురేపు ఎపిలోనూ బయట పడతాయి. రాష్ట్రాలను అప్పులపాలు చేయడంలో కెసిఆర్, జగన్ పోటీపడ్డారు. అవినీతిలోనూ పోటీ పడ్డారు. ఈ రాష్ట్రం ఏమైతే నాకేందన్న ధోరణిలో కెసిఆర్, జగన్ వ్యవహరించిన తీరు క్షంతవ్యం కాదు. ఇలాంటి అవినీతిపరులను ఊచలు లెక్కపెట్టేలా చేయాల్సిందే. ప్రాంతీయ పార్టీల నేతల అవినీతి కారణంగానే రాష్ట్రాలు అభివృద్ధి చెందడం లేదు. మోడీ నియంతృత్వ పాలన అంటూ విమర్శలు చేస్తున్న నేతలు ఎవరు కూడా మోడీ ముందు నిలబడి గట్టిగా నిలదీయలేకపోతున్నారు. సమస్యలపై పోరాడలేక పోతున్నారు. ఉమ్మడిగా పోరాడాలన్న సంకల్పం ఎలాగూ లేదు..కనీసం ఉమ్మడి కార్యాచరణకు కూడా విపక్షాలు కలసి రాలేక పోతున్నాయి. ప్రాంతీయ పార్టీల నేతలు తమ రాష్ట్రాల్లో అనేక అవినీతి, అక్రమాల్లో కూరుకుని పోయారు. పాలన చేపట్టిన ప్రతి రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల అధినేతలు అవినీతి ఊబిలో కూరుకుపోయారు. ఇదే అదనుగా మోడీ ద్వయం ఈ పార్టీల ను చెడుగుడు ఆడేస్తుస్తున్నది. అందుకే మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ మోడీని నేతగా ప్రజలు గుర్తించారు. ప్రత్యమ్నాయం లేదన్న భావనలో ప్రజలు ఉన్నారు. అవినీతిలో కూరుకుపోని రాష్ట్రం లేదు.అవినీతి వ్యతిరేక ఉద్యమం నుంచి వచ్చి ఆప్ నేతలు కూడా అవినీతిలో కూరుకు పోయారు. అరవింద్ కేజ్రీవాల్ సైతం లిక్కర్ స్కామ్‌లో ఇరుకున్నారు. ఇక కెసిఆర్ కూతురు కవిత గురించి చెప్పాల్సిన పనిలేదు. బెంగాల్‌లో మమతా బెనర్జీ పార్టీ నేతలపైనా అనేక అవినీతి ఆరోపణలు ఉన్నాయి. వీరంతా కలిసి కాంగ్రెస్‌తో జతకట్టి ఇండియా కూటమిగా వచ్చినా ప్రజలను అంతగా ప్రభావితం చేయలేక పోయారు. ఈ కారణంగానే ప్రాంతీయ పార్టీల నేతలు కేంద్రాన్ని గట్టిగా నిలదీయలేక పోతున్నారు. కేవలం వారున్నచోటనే కూర్చుని విమర్శలు చేస్తున్నారు. తెలంగాణలో కెసిఆర్ విమర్శలు లేదా ఆరోపణలు తెలంగాణ దాటి రాలేకపోతున్నాయి. ఎపిలో జగన్ అవినీతి అక్రమాలతో విసుగెత్తిన జనం మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం చేశారు. ఒకప్పుడు జాతీయ పార్టీలకు సవాలుగా నిలిచిన ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు ప్రాంతీయ అస్తిత్వం కాపాడు కునే ప్రయత్నంలో ఉన్నాయి. నాయకులలో అధికార కాంక్ష పెరిగిపోవడం కారణంగా సొంత రాష్ట్రం వదిలి రావడం లేదు. అవినీతి కోసం నానా గడ్డీ కరుస్తున్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ పెట్టిన తరవాత ప్రతిపక్ష రాజకీయాలకు ఉమ్మడి ఎపి కేంద్ర బిందువుగా ఉండేది. ఆనాటి కాంగ్రెస్ పార్టీ నియంతృత్వ విధానాలపై తెలుగుదేశం అలుపెరగని పోరాటం చేసింది. ఎన్టీ రామారావు తరవాత చంద్రబాబు నాయుడు జాతీయ స్థాయిలో ప్రతిపక్ష రాజకీయాలలో కీలక పాత్ర పోషించారు. అదే చంద్రబాబు ఇప్పుడు ఢిల్లీలో మళ్లీ కొంత కీలకంగా మారారు. తెలంగాణలో భారత రాష్ట్ర సమితిని ప్రారంభించిన కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పుతానని ప్రకటించినా.. ఆయన తెలంగాణ దాటి రాజకీయాలు చేయలేకపోయారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఘోర పరాజయంతో ఇక పార్టీ మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. దీనికితోడు పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్‌రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్నా..జాతీయ రాజకీయాలపై ఎప్పుడూ ఆసక్తి చూపలేదు. రాష్ట్రంలో అవినీతి కార్యక్రమాల్లో బిజీగా ఉన్న కారణంగా ఘోరంగా ఓడిపోక తప్పలేదు. అలాగే తనకున్న అవితీతి అక్రమ కేసుల బలహీనతల కారణంగా బిజెపిని ఏనాడూ ఎదరించే సాహసం చేయలేదు. మరో ప్రాంతీయ పార్టీ అధినేత చంద్రబాబు అధికారంలోకి వచ్చినా.. ఇప్పుడు ఎన్‌డిఎలో ఉండడంతో మోడీకి వ్యతిరేకంగా నిలదీసే ధైర్యం చేయలేదు. మళ్లీ అధికారం దక్కించుకోవడంతో ఎపిని గట్టెక్కించేందుకు నానా తంటాలు పడకతప్పదు. తమకున్న పరిధి రీత్యా ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీని జగన్ లేదా కెసిఆర్ ఎదిరించలేని పరిస్థితిలో ఉన్నారు. నైతికంగా బలహీన పడటం వల్లనే కేంద్ర అధికారానికి దాసోహం అనాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిన్న మొన్నటి వరకు కేంద్ర ప్రభుత్వంపై కాలు దువ్విన కేసీఆర్, కవిత లిక్కర్ స్కామ్ తరవాత పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది. జాతీయ స్థాయిలో ప్రతిపక్షాలను ఏకం చేస్తానంటూ వివిధ రాష్ట్రాలలో పర్యటించి, హడావిడి చేసిన కెసిఆర్ సార్వత్రిక ఎన్నికల ముందు చతికిల పడ్డారు. దీంతో ఆయనను ఎవరు కూడా నమ్మలేని స్థితికి వచ్చారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కవిత పీకల్లోతు ఇరుక్కున్నాక..ఇప్పుడు బయటపడుతున్న అవినీతి వ్యవహారాల తో కెసిఆర్ రాజకీయంగా సమాధి అయినట్లే. మొత్తంగా తెలుగు రాష్ట్రాల్లో బిజెపిని ఎదురించడానికి సాహసించే నాయకులు కానరావడం లేదు. చంద్రబాబు అయితే కేవలం ఇప్పుడు ఎపికి పరిమితం అయ్యారు.ఇక మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, అరవింద్ కేజ్రీవాల్‌లు సైతం మోడీని ఎదిరించలేక చతికిల పడ్డారు. ఇలా ఒక్కో రాష్ట్రంలో ప్రాంతీయ పార్టీల నేతలు అవినీతిలో కూరుకు పోవడమే దీనికి కారణం. వీరంతా కలిసినా ప్రత్యమ్నాయం సృష్టించలేరని ప్రజలకు కూడా తెలిసిపోయింది. అందుకే మోడీకి ప్రత్యామ్నాయ నేత లేన్న భావనలో ప్రజలు కూడా ఉన్నారు. కాంగ్రెస్‌లో కూడా కుటుంబ రాజకీయాలు మరింత జోరుగా చర్చకు వస్తున్నాయి. ప్రియాంక కూడా రాజకీయ అరంగేట్రానికి రంగం సిద్ధం అంటోంది. అధ్యక్షుడిగా ఉన్న మల్లికార్జున ఖర్గే నామమాత్రంగా ఉన్నారు. మొత్తంగా ప్రాంతీయ పార్టీల అవినీతి కారణంగా దేశం కూడా కుంటుపడుతోంది. ఇలాంటి అవినీతి నేతలను బోనులో నిలబెట్టేలా సత్వర చర్యలకు వీలు కలిగించే చట్టాలు రావాలి. లోక్‌పాల్ డిమాండ్ సాకారం కావాలి.అవినీతి కేసుల్లో ఏడాదిలోపే దర్యాప్తు పూర్తి చేయించి, శిక్షలు పడేలా చేస్తేనే మంచిది.

## కవిత్వం

### సుపరిపాలన!

స్వతంత్రం వచ్చేక ఏదో
సాధించాలని
అక్కడక్కడే
తిరుగాడుతున్నాం..
ఎలక్షన్లు వస్తున్నాయి
పోతున్నాయి
అన్ని దార్లూ
మూసుకుపోతున్నా
తెరమీద సుపరిపాలనే
తెల్లగా పొద్దు
పొడుస్తోంది..!
అగమ్యగోచర చీకట్లు
చీలిపోయి
నిజమే నవోదయమై
వెలుగుతూ
నిట్టనిలువుగా నిలబడి
చూస్తోంది..!
అధికారానికి దగ్గర
దారంటూ మృగ్యం
కష్టం, అవినీతి
రాహిత్యాలు తప్ప
ప్రజల మనసుల్లో చోటు
దక్కించుకొనే
కిటుకులు జిమ్మిక్కులు
చిట్కాలు లేనే
లేవు వున్నాయనుకొన్న
వాళ్ళు లేకుండా
పోయిన చరిత్ర మన
కళ్ళముందే
రెపరెపలాడుతోంది
కూడా!
దేహం కాదు దేశం అన్న
కామరాజ్ నాడార్
చిరిగిన చొక్కా
తొడిగినా పర్లేదు
అవినీతిని అంటనివ్వని
ప్రకాశం పంతులు
ఏ వైరుధ్యాలు లేని
నవభారతమే
నా దేవళం అన్న
అంబేడ్కర్
లాంటి నాయకుల
ఫోటోలు కాదు
జీవిత చరిత్రలు వల్లె వేసే
పాఠ్యలయాలు
కావాలి రాజకీయ పార్టీల
కార్యాలయాలు..
ప్రజా సంక్షేమం అంటే
ప్రజలతోనే
మమేకమై రాజ్యాన్ని
అభివృద్ధి దిశగా
నడిపించుకు తీసికెళ్లే
పురోగామిక శక్తి
తప్ప ఇంకోటి కానే
కాదు!
పేదవాడికి బ్రతుకు
తెరువుగా చేపల
వల ఇవ్వాలి...రోజూ
చేపల కూర
వండి పెట్టటం సాధ్యం
కాదు గదా?
అభివృద్ధి సంక్షేమం అంటే
అందర్నీ
అందులో భాగస్వామ్యుల్ని
చేయడమే!

భీమవరపు పురుషోత్తమ్
రాజమండ్రి, :9949800253

### తాతయ్య చెప్పిన మాటలు



"పిల్లలు సమయం ఎనిమిది గంటలవుతుంది. ఇంకా మీరు నిద్ర లేవకుంటే ఎలా ?ఇంత సోమరులుగా పడుకుంటే ఆరోగ్యానికి హానికరం. తొందరగా లేవండి అంటూ బామ్మ కేకలు పెట్టింది" .ఇవేమీ తమకు పట్టనట్టు కావ్య నవ్య అలానే పడుకున్నారు. మరోవైపు బామ్మ మాటలు మీకు వినిపించట్లేదా? అంటూ అమ్మ మాటలు చెవిలో మారు మోగుతుంటే ఇక తప్పదు అన్నట్టు నిద్ర నుండి మేల్కొని వచ్చారు. వస్తూనే టీవీ ఒకరు, ఇంకొకరు సెల్ఫోన్ చూస్తున్నారు. వీరిని గమనిస్తున్న తాతయ్య ముసి ముసి నవ్వులు నవ్వుతూ పిల్లలూ మీరు తొందరగా రండి మీతో కాస్త మాట్లాడాలి అనగానే అలాగే తాతయ్య అంటూ భారంగా పది నిమిషాల్లో రెడీ వచ్చారు.

"తాతయ్య ఇప్పుడు చెప్పండి మాతో ఏదో మాట్లాడాలి "అన్నారు కదా. ఎందుకు తొందర, మీరు ముందుగా టిఫిన్ తినండి .సాయంకాలం పార్కుకి వెళ్దాం అక్కడ తీరిగ్గా మాట్లాడుకుందాం అని తాతయ్య చెప్పగానే రెండు నిమిషాల్లో గబగబా టిఫిన్ ముగించారు. సాయంకాలం తాతయ్యతో కలిసి సరదాగా ఇంటికి దగ్గర్లో ఉన్న పార్కు వెళ్లారు. అక్కడ చాలాసేపు హాయిగా ఎగిరి గంతులు వేస్తూ ఆడుకున్నారు. వారిని గమనిస్తున్న తాతయ్య ఇటు రమ్మని సైగ చేశాడు.

తాతయ్య పిల్లలతో "పిల్లలు మీరు ప్రతిరోజు ఆలస్యంగా నిద్రలేస్తున్నారు నిజమేనా? అవును తాతయ్య. ఒరేయ్ ఆలస్యంగా నిద్ర లేవడం ద్వారా సోమరులుగా తయారయ్యే అవకాశం ఉంది .సూర్యోదయానికి ముందే లేచి జాగింగ్, వ్యాయామం లాంటివి ఆరోగ్యానికి చాలా మంచిది. మరి మీరు అందుకు విరుద్ధంగా చేస్తున్నారు ఆలస్యంగా నిద్రలేస్తున్నారు. ఇలానే చేస్తే మరి బద్దకస్తులయ్యే ప్రమాదం ఉందన్నాడు.

సెలవుల్లో హాయిగా ఇంట్లో అమ్మకు వంటింట్లో సహాయం చేస్తూ ఉండడం ద్వారా భవిష్యత్తులో మీకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కూరగాయలు తరగడం, మీ బట్టలు మీరే ఉతకడం లాంటి చిన్న చిన్న పనులు తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా భవిష్యత్తులో పెద్ద చదువులు చదవడానికి వెళ్ళినప్పుడు అక్కడ మీ పనులు మీరే స్వయంగా చేసుకోవాలి .అది ఇప్పటినుండి మీరు నేర్చుకోవడం మంచిది అని చెప్పగానే సరే తాతయ్య "మీరు చెప్పినట్టు అన్ని పనులు రేపటి నుండి మేమే చేస్తాం మీరు చూస్తూ ఉండండనగానే తాతయ్య సంతోషించాడు.

మరుసటి రోజు నుండి అందరి కంటే ముందుగానే కావ్య , నవ్య ఇంట్లో పనులన్నీ పూర్తి చేశారు . పిల్లలు త్వరగా లేచి అన్ని పనులు చేయడం ఇంట్లో వారందరినీ ఆశ్చర్యపరిచింది. అంతే కకుండా బామ్మ సహకారంతో రకరకాలైన వంటలు నేర్చుకున్నాను .తన మాట మీద గౌరవంతో పిల్లలు మారినందుకు తాతయ్య వారిని అభినందించారు.

**నీతి: చదువుతోపాటు ఇంట్లో పనులు కూడా నేర్చుకోవాలి.**

రచన:యాడవరం చంద్రకాంత్ గౌడ్
సిద్దిపేటజి. 9441762105






## ఇంపార్టెన్స్ ఆఫ్ పాలిమర్స్ పై కేయూలో ఓరియంటేషన్

హనుమకొండ జూన్ 14 (ప్రజామంటలు):
ప్రభుత్వ పాలిటెక్నిక్ అధ్యాపకుల 3 వారాల ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో "ఇంపార్టెన్స్ ఆఫ్ పాలిమర్స్" అనే అంశం పై సెమినార్ రసాయన శాస్త్ర విభాగ అధిపతి ఆచార్య టి సవితా జ్యోత్స్న సారధ్యం లో నిర్వహించారు. ఈ సెమినార్ లో నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ ఫార్మస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (నైపర్) పూర్వ రిజిస్ట్రార్, కేయూ రసాయన శాస్త్ర విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య సంజీవ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ స్థానం లో బయో డీగ్రేడబుల్ పాలిమర్లను వాడాలి" అన్నారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో బయోడిగ్రేడబుల్ దారాలు, పేపర్ కప్ లు, జూట్ లేదా బట్టతో చేసిన సంచులు, ప్రకృతి సంబందిత రంగులు, ఇతర వంట పాత్రలు వాడకం పెరగాలి అన్నారు, దీనిపై ప్రజల్లో చాల చైతన్యము, అవగాహన అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు పాల్గొన్నారు.

## ఇచ్చిన డబ్బులు అడిగితే చంపేస్తామని బెదిరించడంతో మానసిక వేదనకు గుర్రై ఉరి వేసుకుని ఆత్మహత్య



ఇబ్రహీంపట్నం జూన్ 14 (ప్రజామంటలు): గురువారం రోజున సాయంత్రం అందాద 9 గంటల సమయంలో ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన సున్నం రవి (తండ్రి: పెద్ద ముత్తన్న , వయస్సు: 42) అనే వ్యక్తి తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే అతడు ఆత్మహత్య చేసుకోవడనికి గల కారణాలను సూసైడ్ నోట్ లో తెలిపినాడు. ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన రెబ్బటి రాజేందర్ అనే వ్యక్తి తనకు రెండు లక్షల రూపాయలు అప్పుగా ఇవ్వకుండానే ఇచ్చినట్టు బెదిరించి, కొట్టి సంతకం తీసుకున్నాడని మరియు ఆ డబ్బులను ఇప్పుడు చెల్లించాలని బెదిరించినాడని మరియు కనక జగన్, చెప్పుల శ్రీనివాస్ మరియు గణేష్ అనువారు మృతుడు అయిన సున్నం రవి నుండి డబ్బులు అప్పుగా తీసుకొని తిరిగి చెల్లించకుండా ఇబ్బంది పెట్టినారని, మరలా డబ్బులు ఇవ్వమని అడిగితే చంపుతామని బెదిరించినారని తన యొక్క సూసైడ్ నోట్లో రాసుకున్నాడు. దీంతో మృతుడు సున్నం రవి ఈ నలుగురికి భయపడి మానసికంగా వేదనకు గురి అయ్యి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడు భార్య సున్నం లక్ష్మి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నలుగురు పైన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతుందని మరియు మృతుడికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు సంతానం కలదు అని ఎస్సై ఏ. అనిల్ తెలిపినారు.

## యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సజ్జద్ ను సన్మానించిన మస్జిద్ కమిటీ అధ్యక్షులు

జమ్మికుంట (ప్రజా మంటలు ):
హుజురాబాద్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్గా ఇటీవల నియామకమైన మొహమ్మద్ సజ్జద్ ను శుక్రవారం వీణవంక మండలంలోని చల్లూరు, గ్రామ మైనార్టీ సోదరులు పూలమాల శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు మాట్లాడుతూ.... కష్టపడ్డా కాంగ్రెస్ కార్యకర్తలకు ముఖ్యంగా మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ గుర్తింపునిస్తుంది అనడంలో నిదర్శనం సజ్జద్ అని, భవిష్యత్తులో మరిన్ని పదవులు పొంది మైనారిటీలకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఖుబా మస్జిద్ సదర్ సాహబ్ ఎండి ఖమ్రొద్దీన్, జామా మస్జిద్ సదర్ సాహబ్ ఎండి జాఫర్ సాహబ్, ఇమామ్లు ముఫ్తి జుబెయిర్ అన్సారి, మౌశీన్ ఆలం, మునిరుద్దీన్, ముస్తాక్ అహ్మద్, మస్జిద్ కమిటీ సభ్యులు ముస్తాక్, నకియుద్దీన్, జీలానీ, ఫకీర్ పాషా, సోహెల్, రషీద్ బాబా, జావీద్ , దౌలత్, రఫీక్ , తౌసిఫ్, ఫెరోస్, షాబుద్దీన్, సైదుల్లా, మథిన్, ఆఖిల్ పాషా, నిస్సార్, జమీల్, మౌసీన్ , ఆజం తదితరులు ఘనంగా సన్మానించారు.



## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



ఇబ్రహీంపట్నం జూన్ 14 (ప్రజామంటలు): ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం సరస్వతి విగ్రహానికి పూజలు నిర్వహించి అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం, అన్న ప్రసన్నం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అంగన్వాడి సూపర్వైజర్ ప్రతిభ మాట్లాడుతూ.... పిల్లలను అంగన్వాడి కేంద్రానికి పంపించాలని ఆటపాటలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తారని పిల్లలని తప్పకుండా అంగన్వాడి కేంద్రాలలో చేర్పించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుందరగిరి గంగామణి, వై. సంజీవరాణి, ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు మనోజ్, ప్రసాద్, అశోక్, రాజ్ కుమార్, స్వామి, లింగస్వామి, భవాని, మమత, శివ, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు లింగంపల్లి లక్ష్మి, గ్రామపంచాయతీ కారోబార్ శ్రీనివాస్, ఆయాలు గుండు శ్యామల, విమల, గర్భిణీలు, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాల పట్టణంలోని పెద్దమ్మతల్లి బోనాల పండుగ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి భర్త లక్ష్మణ్. వీరితో పాల్గొన్న ముదిరాజ్ సంఘం అధ్యక్ష కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ నాయకులు

## అంగన్వాడీ కేంద్రంలో కొత్తగా నమోదైన పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన



జగిత్యాల రూరల్ జూన్ 14 (ప్రజామంటలు):
జగిత్యాల రూరల్ బాలపెల్లి ప్రాథమిక పాఠశాల మరియు అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు. కొత్తగా నమోదైన పిల్లలకి అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు నెలల నుండి మూడు సంవత్సరాల పిల్లలకు బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేయడం జరిగింది. ఆరు నెలలు నిండిన పిల్లలకి అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పుట్టిన నుండి ఐదు సంవత్సరాల పిల్లల బరువులు. ఎత్తులు చూసి వారి పోషణ స్థితి గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ రెడ్డి కార్యదర్శి జయశ్రీ, స్కూల్ హెచ్ఎం సునీత, శ్రీవాణి టీచర్, అంగన్వాడీ టీచర్స్ కవిత, రాజు, ఆది రమ, ఆయాలు, తల్లులు, పిల్లలు హాజరైనారు.



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ కుమార్ పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుక్రవారం ఢిల్లీలోని వారి అధికారిక నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేసిన జగిత్యాల జిల్లా బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్ రెడ్డి, బిజేపి నాయకులు ఎడ్ల వినోద్ రెడ్డి, జిల్లా నాయకులు

## సక్ష్యం భారత్ సమర్థ భారత్
### జీతే జీతే రక్తదాన్.. జాతే జాతే నేత్రదాన్...





జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు):
ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక మేయో హాస్పిటల్ నందు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ ఆఫీసర్ వి. ఉపేందర్ మాట్లాడుతూ.... ప్రమాదంలో గాయపడ్డ వారికి మరియు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి రక్తం ఎంతో ఆవశ్యమని ప్రతి ఒక్కరూ తమ సామజిక బాధ్యతగా రక్తాన్ని ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇవ్వాలని తెలియజేశారు. భారత ప్రభుత్వం కూడా రక్తదాన ఆవశ్యతను గురించి తెలియజేస్తూ జీవన్ దాన్ రక్తదాన్ అని అన్నారు. సాక్ష్యం జగిత్యాల జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాటిపాముల సురేష్ కుమార్ మాట్లాడుతూ.... సక్షం హీమోఫిలియా, సికిల్ సెల్ వ్యాధి మరియు తలసేమియాతో బాధపడుతున్న రోగులకు నిరంతరం రక్తదానం చేయడం మరియు ఉచిత రక్తాన్ని అందించడం మరియు కుటుంబానికి సహాయం చేయడం ద్వారా వారి సాధికారత కోసం పనిచేస్తుంది అని అన్నారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు బోనగిరి దేవయ్య మాట్లాడుతూ.... ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవు సౌకర్యం కల్పించారని చెప్పారు. జిల్లా కెమిస్ట్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు గాలిపల్లి నర్సయ్య మాట్లాడుతూ రక్తదానం కావలసిన ఎవరైనా బాధితులు జిల్లా అసోసియేషన్ సంప్రదిస్తే వారికి కావలసిన రక్తం చేస్తామని చెప్పడం జరిగింది. ఇట్టి ఈ కార్యక్రమంలో సక్ష్యం జిల్లా కార్యదర్శి కూర్మాచలం రఘునందన్, బోయినపల్లి ప్రసాదరావు, వడ్లకొండ రవీందర్, పాల్తెపు శంకర్, కొలిచాల రవీందర్, చాకుంట వేణుమాధవరావు, టి. లక్ష్మణ్ రావు,జొన్నల పూర్ణచందర్, చిత్తారి మధుకర్, కస్తూరి వెంకటరమణ, కస్తూరి శ్రీధర్, సిరిపురం శ్రీనివాస్, జి.వి. రామకృష్ణ,వాల్మీకి ఆంజనేయులు, కందుకూరి రాజేశ్వరరావు, బుధవారపు శ్రీహరి, పెండం గంగాధర్, చలపతి, వొల్లపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి మంత్రి పొన్నంకు
## బేషరుతుగా క్షమాపణ చెప్పాలి
### గీకురు రవీందర్



ఇల్లందకుంట మండలం జూన్ 14 (ప్రజామంటలు):
మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ పై అసత్య ఆరోపణలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బేషరుతుగా క్షమాపణ చెప్పాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు, జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం హుజురాబాద్ ప్రెస్ క్లబ్ లో పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... పొన్నం ప్రభాకర్ పై నిరాధారమైన ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని కౌశిక్ రెడ్డి ఖబర్దార్ అంటూ హెచ్చరించారు,సింగరేణి నుండి ఖమ్మంకు తరలి పోతున్న ఫ్లైయాష్ బూడిదకు మరియు లారీల ఓవర్ లోడ్ కు పొన్నం ప్రభకర్ సంబంధం ఉందని అనడం హాస్యాస్పదమన్నారు. కౌశిక్ రెడ్డి ఏదో విధంగా వార్తల్లో కెక్కాలనే దురాలోచన బిసి మంత్రి మీద ప్రయోగిస్తే బాగుండదని తీవ్రంగా హెచ్చరించారు.పొన్నం ప్రభాకర్ గౌడ్ కృషితో పట్టుదలతో పైకి వచ్చాడని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతిని కోరుకునే నాయకుడని, తెలంగాణ ఉద్యమ కాలంలో పార్లమెంట్ లో పెప్పర్ స్ప్రేకు గురైన ఉద్యమకారుడన్నారు. అవినీతి ఆరోపణలు లేని మచ్చలేని నాయకుడున్నారు. ఉద్యోగాల పేరిట లక్షలాది రూపాయలు వసూల్ చేసి, ఇసుక దందా నడిపిన నీచ చరిత్ర కౌశిక్ రెడ్డి దన్నారు. జిల్లా అధ్యక్షులు నాగుల కనకయ్య గౌడ్ మాట్లాడుతూ బిసి నాయకులపై అవాక్కులు, చవాక్కులు పేలితే నియోజక వర్గంలో తిరగనివ్వ బోమని, గతంలో కూడా బీసీలను కులం పేరుతో దూషించిన నీ నీచబుద్ధి మానుకోవాలన్నారు. ఎంఎల్ఏ గా గెలువకుంటే కుటుంబ సభ్యులతో సహా విషం తాగి చస్తామని బ్లాక్ మెయిల్ రాజకీయాలతో గెలిచావన్నారు. రాబోయే కాలంలో మీ పద్ధతి మార్చుకోకుంటే బహుజన బిడ్డలు నీకు తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు.ఈ పత్రికా సమావేశములో బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు నారొజు రాకేష్ చారి, బిసి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మాచర్ల ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి రామ్మూర్తి గౌడ్, ఇల్లందకుంట మండల బీసీ సంఘం అధ్యక్షులు మోత్కూరి శ్రీనివాస్ గౌడ్, వీణవంక మండల అధ్యక్షులు మొటం వెంకటేష్, యువజన సంఘం అధ్యక్షులు కొలిపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



ఎల్కతుర్తి జూన్ 14 (ప్రజామంటలు):
హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం బావుపేట్ గ్రామంలో బి.ఆర్.ఎస్. పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ మేకల రాజయ్య తల్లి లక్ష్మి ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను మాజీ శాసన సభ్యులు వొడితల సతీష్ కుమార్, హన్మకొండ జిల్లా పరిషత్ చైర్మన్ సుదీర్ కుమార్ పరామర్శించారు. వారి ఆత్మకి శాంతి చేకూరాలని భగవంతుడు వారి కుటుంబానికి మనో ధైర్యాన్ని ప్రసాదించాలని అన్నారు. వారి వెంట ప్రజా ప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

## టీఎన్జీవో రాష్ట్ర నూతన ప్రధాన కార్యదర్శిని సన్మానించిన జగిత్యాల టిఎన్జిఓ లు



హైదరాబాద్ జూన్ 14 (ప్రజామంటలు):
నాంపల్లిలోని టీఎన్జీవో రాష్ట్ర సంఘ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ అధ్యక్షతన (33) జిల్లాల అధ్యక్ష కార్యదర్శులతో కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశానికి జగిత్యాల జిల్లా తరఫున జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్ మరియు జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి హాజరైనారు. ఈ సమావేశంలో గత కొన్ని నెలలు గా ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎస్.యం. హుస్సేన్ ను ఏకగ్రీవంగా కోఆప్షన్ ద్వారా ఎన్నుకోబడినారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఉద్యోగుల పక్షాన జిల్లా అధ్యక్షులు భోగ శశిధర్, జిల్లా కార్యదర్శి మిర్యాల నాగేందర్ రెడ్డి మరియు ట్రెసా జిల్లా అధ్యక్షులు యం.డి. వకీల్ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ మరియు ప్రధాన కార్యదర్శి ఎస్.యం. హుస్సేన్ మాట్లాడుతూ.... ఉద్యోగుల సమస్యలు మరియు వారికి రావలసిన ప్రయోజనాల గురించి ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామని, ఉద్యోగులు ఎవరు కూడా అధైర్య పడవద్దని, వారి సంక్షేమం కోసం టీఎన్జీవోల సంఘం ఎప్పుడూ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జిఓ నాయకులు రవీందర్, మధుకర్, సురేందర్, శ్యాంకుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవానికి ఆహ్వానం

జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు):
శనివారం ఉదయం 9.30 ని.లకు ఆర్డీవో జగిత్యాల కార్యాలయం ఆవరణలో ఉన్న సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో ప్రపంచ వయో వృద్ధులపై వేధింపుల నివారణ అవగాహన దినోత్సవము జరుపుతున్న సందర్భంగా సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరు అయ్యి విజయవంతం చేయాలని కోరుతున్నామని హరి ఆశోక్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్, జగిత్యాల జిల్లా ఒక ఒక ప్రకటనలో తెలిపారు.



## పదోన్నతులు కల్పించాలని టీజీ ఎన్పీడీసీఎల్ సిఎండి ని కలిసిన స్టేట్ సెక్రెటరీ జనరల్ శ్రీధర్

జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు):
గత ఐదేళ్ల నుండి ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు పదోన్నతులు లేవని వెంటనే పదోన్నతులు కల్పించాలని, అన్ యూజుడ్ పోస్టులు భర్తీ చేయాలని, అలాగే ఆర్టిజన్ సమస్యలు పరిష్కరించాలని ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి కి స్టేట్ సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసినట్లు ఉద్యోగ సంఘాల నాయకులు తెలిపారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అయితే పదోన్నతుల విషయమై ఆందోళన చెందవద్దని పదోన్నతుల విషయంను పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా సీఎండీకి వివరించినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కార్య నిర్వాహక అధ్యక్షుడు తులసి రెడ్డి, ఐ ఎన్ టి యు సి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాంజీ నాయక్ తదితరులు వారి వెంట పాల్గొన్నారు.

## అత్యాచారం కేసు వివరాలు సేకరిస్తున్న పోలీసు అధికారులు

గొల్లపల్లి జూన్ 14 (ప్రజామంటలు):
గొల్లపల్లి మండల పరిధిలో ఓ గ్రామానికి చెందిన మానసిక వైకల్యంతో బాధపడుతున్న 21 సం. గల అమ్మాయిని అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారం చేసాడు. అట్టి బాధితురాలు తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గొల్లపల్లి పోలీసులు కేసు దర్యాప్తులో భాగంగా సంఘటన స్థలాన్ని జగిత్యాల డి.ఎస్.పి. రఘు చందర్, ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, గొల్లపల్లి ఎస్ఐ సతీష్ లు పరిశీలించి కేసుకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

## ప్రైవేట్ బడి వద్దు ప్రభుత్వ స్కూలే ముద్దు



ఎల్కతుర్తి జూన్ 14 (ప్రజామంటలు):
ఎల్కతుర్తి మండలం వల్లభపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగినటువంటి బాలసభ కార్యక్రమంను ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరుగగా దీనిలో భాగంగా విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు విద్యార్థుల కొరకు విద్యార్థుల చేత ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాటలు, కథలు, పద్యాలు, సామెతలు, పొడుపు కథలు, మంచి పాటలు చదివి వినిపించడం జరిగింది. దీని వలన విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు, భాషా సామర్థ్యం, పెరుగుతాయి అని ప్రధానోపాధ్యాయులు సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘురామ్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట స్వామి, వెంకట సుహాసిని, వాసంతి, శ్రీదేవి, అనిత పాల్గొన్నారు.

## పోరండ్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం
### పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల రూరల్ జూన్ 14 (ప్రజామంటలు):
జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామములో అంగన్వాడి బడిబాట కార్యక్రమములో శాసనమండలి సభ్యులు టి. జీవన్ రెడ్డి పాల్గొని అంగన్వాడి కేంద్రములలో క్రొత్తగా నమోదు అయిన పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు. పిల్లల తల్లిదండ్రులకు అంగన్వాడి కేంద్రములో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పి. శారద, డి. లక్ష్మి, అంగన్వాడి టీచర్లు, ప్రజాప్రతినిధులు మరియు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# రైతులకు ఆయిల్ ఫామ్ ద్వారా అధిక లాభాలు

**ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే ఏకైక పంట ఫామ్ ఆయిల్**

**మండలంలో 2000 ఎకరాల లక్ష్యంతో ఆయిల్ ఫామ్ క్షేత్రాలు**

**ఆయిల్ ఫామ్ సాగుపై ఎలాంటి అపోహలు అక్కరలేదు**

**రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు**

భీమదేవరపల్లి జూన్ 14 (ప్రజామంటలు):

భారతదేశంలో వివిధ రకాల వంట నూనెల వినియోగం ఎక్కువగా ఉండడంతో, పలు రకాల నూనె గింజలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తూ, రైతులకు పలు రకాల సబ్సిడీలను అందిస్తున్నట్లు కే.ఎన్. బయో సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆయిల్ ఫామ్ హనుమకొండ జిల్లా కో-ఆర్డినేటర్ రంజిత్ కుమార్ అన్నారు.

**తక్కువ పెట్టుబడితో అధిక లాభం:**

ఫామ్ ఆయిల్ తోటల పెంపకానికి అంతగా పెట్టుబడి అవసరం లేదని, ప్రభుత్వ సబ్సిడీలతో అదనంగా అంతర్ పంటలను పండిస్తూ అధిక ఆదాయాన్ని పొందవచ్చు. పకృతి వైపరీత్యాలను తట్టుకునే ఏకైక పండగ ఆయిల్ ఫామ్ సాగును చెప్పవచ్చు.

**పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు:**

ప్రస్తుతం ఆయిల్ ఫామ్ కు మార్కెట్లో అధిక డిమాండ్ ఉండడంతో రైతులను ఆ దిశగా ప్రోత్సహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన పెట్టుబడి సాయాన్ని రైతులకు అందజేస్తున్నాయి ఆయిల్ ఫాం సాగు కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాల సబ్సిడీలు ఇస్తున్నాయి. మొక్కలను అందజేసినప్పటి నుండి డ్రిప్పు పరికరాలు, ఎరువులు, అంతర్ పంటల సాగు కోసం ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహకాలను అందిస్తుంది.

**మండలములో 2000 ఎకరాల్లో సాగు లక్ష్యంగా ముందుకు....**



భీమదేవరపల్లి మండలంలో 2000 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగును కొనసాగించేందుకు ఆయిల్ ఫామ్ కంపెనీల ద్వారా రైతులకు అనుకూలంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని కొత్తపెల్లి వద్ద ఆయిల్ ఫామ్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

**ఆయిల్ ఫామ్ సాగు కోసం రైతులు ముందుకు రావాలి**

మండలంలో ఆయిల్ ఫామ్ కు అనుకూలంగా నేలలు ఉండడంతో ఇప్పటికే 302 ఎకరాలలో ఆయిల్ ఫామ్ సాగు కొనసాగుతుంది. ఆయిల్ ఫామ్ రైతుల ప్రోత్సాహంతో మండలంలోని చాలామంది రైతులు ఆయిల్ ఫామ్ సాగు పట్ల ఆసక్తి చూపిస్తున్నారు. 2000 ఎకరాలలో సాగు బడే లక్ష్యంగా ముందుకు కొనసాగుతున్నట్లు రంజిత్ కుమార్ తెలిపారు.



## ఏళ్ళు గడుస్తున్నా పాలకులు తమను పట్టించుకోవడం లేదని మార్కండేయనగర్ ప్రజల ఆవేదన

జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు):

జగిత్యాల పట్టణంలోని 20వ వార్డు మార్కండేయ నగర్ లో చిన్నపాటి వర్షానికి డ్రైనేజీలు వరదలు పారుతున్న మార్కండేయ నగర్ కాలనీవాసులకు వర్షాకాలం వచ్చిందంటే బయటకు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంటుంది. రోడ్లు మొత్తం జలమయమై వరదలు పారుతూ ఒక చిన్న కాలువ లాగా ప్రవహిస్తూ ఉండటం జరుగుతుంది. కొన్ని సంవత్సరాలు నుండి ఇదే విధంగా కొనసాగుతుంది కానీ ఇప్పటివరకు అధికారులు కానీ, రాజకీయ నాయకులు కానీ పట్టించుకోవడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే కాలనీవాసులకు చాలా ఇబ్బందిపరంగా ఉండడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న వాళ్ళైనా మా ఇబ్బంది తీరుస్తారని 20వ వార్డు ప్రజలు ఆశిస్తున్నారు.

## ఉత్తమ రక్తదాత సుధీర్ కు సన్మానం



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు):

రక్తదాతల దినోత్సవం పురస్కరించుకొని జగిత్యాల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉత్తమ రక్తదాత చింత సుదీర్ ను సన్మానించి ప్రశంసా పత్రం అందజేశారు. జగిత్యాల పట్టణానికి చెందిన చింత సుదీర్ ఆయన మిత్ర బృందం జగిత్యాల చుట్టూ పక్కల యువత కొన్ని బ్లడ్ డోనార్స్ గ్రూప్ గా ఏర్పడి రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించుకున్నారు. అనుకున్నట్లుగానే జగిత్యాల, కోరుట్ల, మెట్పల్లి , ఆర్మూర్, నిజామాబాద్, నిర్మల్, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ వంటి నగరాలలో ఏ సమయంలో అయిన రక్తం అవసరం అని సమాచారం తెలియగానే తన మిత్రులతో ఒకరి నుండి మరొకరికి సమాచారం చేరవేసుకొని రక్తదాతలను పంపి రక్తాన్ని అందించారు. ఇప్పటివరకు రాష్ట్ర స్థాయిలో 6 వేల మందికి పైగా రక్తన్నీ అందించి ప్రాణధాతగా నిలిచారు. స్వయంగా సుధీర్ 54 సార్లు రక్తదానం చేయగా ఈయన సేవలను గుర్తించి ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని విరుపాక్షి గార్డెన్ లో చింత సుదీర్ ని సన్మానించి ప్రశంశ పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వెంకటేశ్వర్ రావు, డిఎంహెచ్ఓ ఇంచార్జ్ సమీఉద్దీన్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ప్రవీణ్, పోషక ఆహార నిపుణులు రిచా శ్రీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా సెక్రెటరీ మంచాల కృష్ణ, టీవీ సూర్యం, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, జిల్లా ఉత్తమ రక్తదాతలు తదితరులు పాల్గొన్నారు.




## ధర్మపురి లోని ఓ హెూటల్లో రెవెన్యూ అధికారుల తనిఖీలు

ధర్మపురి జూన్ 14 (ప్రజామంటలు):

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు అధికారుల దృష్టికి రాగా, ఈ నేపథ్యంలోనే తనిఖీలు చేపట్టి 14 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. వాణిజ్య అవసరాలకు ప్రత్యేక గ్యాస్ సిలిండర్లు ఉపయోగించాలని హెూటల్ నిర్వాహకులకు అధికారులు సూచించారు.

## కడుపునొప్పి భరించలేక ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య



భీమదేవరపల్లి జూన్ 14 (ప్రజామంటలు):

కడుపునొప్పి భరించలేక ఓ మహిళ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన భీమదేవరపల్లి మండల పరిధిలోని రంగయ్య పల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన సట్ల రామక్క (77) గత కొంతకాలంగా కడుపునొప్పి, కాళ్ళ నొప్పులతో బాధపడుతుంది. ఆస్పత్రిలో చూపించగా లివర్ లో రాళ్లు వచ్చి ఆపరేషన్ అవసరం కావడంతో శరీరం సహకరించదని డాక్టర్లు తెలిపారు. ఆ బాధ భరించలేక జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి కూతురు నల్లగోని రమ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు వంగర ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

## ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ను కలిసిన బిజెపి తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్.వి సుభాష్

న్యూ ఢిల్లీ జూన్ 14 (ప్రజామంటలు):

ఇటీవల జరిగిన లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి బలంగా పుంజుకొని 35.02 ఓటు షేర్ తో 8 సీట్లు సాధించడంతో తెలంగాణ బిజెపి శాఖను అభినందించిన నిర్మలా సీతారామన్. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి విశేషంగా నిధులు కేటాయించి, అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కేంద్ర మంత్రిని కోరిన ఎన్.వి. సుభాష్. ఆయన వినతి కి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందన. భవిష్యత్తులో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని సూచించిన కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్.



## బ్లడ్ డోనేషన్ పై అపోహలు వద్దు..

**ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం**

**గాంధీ బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో బ్లడ్ డోనేషన్ క్యాంపులు**

సికింద్రాబాద్ జూన్ 14 (ప్రజామంటలు):

రక్తదానంపై ఎవరు కూడ ఎలాంటి అపోహలు పెట్టుకోనవసరం లేదని, ఆరోగ్య వంతులైన ఎవరైన బ్లడ్ డోనేట్ చేయవచ్చని గాంధీ ఆసుపత్రి బ్లడ్ సెంటర్ ఇంచార్జీ, ఆర్ఎంవో డా.సత్యరత్న పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా గాంధీ ఆసుపత్రి బ్లడ్ సెంటర్ ఆధ్వర్యంలో గాంధీ ఆసుపత్రితో పాటు సిటీలోని మరో మూడు చోట్ల బ్లడ్ డోనేషన్ క్యాంపులను విజయవంతంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వచ్ఛంధంగా ముందుకు వచ్చిన రక్త దాతల నుంచి 146 యూనిట్ల బ్లడ్ ను సేకరించారు. బ్లడ్ డోనేట్ చేసిన వారికి గాంధీ ఆసుపత్రి బ్లడ్ సెంటర్ నుంచి సర్టిఫికెట్లను అందచేశారు. ప్రతి వ్యక్తి ప్రతి మూడు నెలల కొకసారి తన బ్లడ్ ను దానం చేయవచ్చని, ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడడానికి బ్లడ్ ఎంతో అవసరం పడుతుందని బ్లడ్ సెంటర్ ఇంచార్జీ డా. సత్యరత్న తెలిపారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, ఆర్ఎంఓ-1 డాక్టర్ జయకృష్ణ ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంపులను నిర్వహించారు. బ్లడ్ డోనేషన్ క్యాంపుల్లో డా. సత్యరత్న తోపాటు మెడికల్ టీమ్ సభ్యులు సునీత, దేవేందర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా గాయత్రి దుర్గాదేవి సత్సంగ వార్షికోత్సవ వేడుకలు

జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు):

జిల్లా కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయము లో గాయత్రి దుర్గా దేవి సత్సంగము ప్రారంభించి ఒక సంవత్సరం గడిచిన సందర్భంగా, ఆలయ నిర్వాహకులు సత్సంగ వార్షికోత్సవం ఘనంగా జరిపారు. ఈ సత్సంగ వార్షి కొత్సవానికి పట్టణం లోని వివిధ సత్సంగ సభ్యులను ఆహ్వానించి, భజనలు, కీర్తనలు, సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణం, చేయించారు. మాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.భక్తులందరికీ నిర్వాహకులు ఆల్పాహారం ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ, అంజన్న,పూజలు నిర్వ హించగా, ప్రముఖ పౌరాణిక ప్రవచకులు బ్రహ్మశ్రీ పాలెపు చంద్ర శేఖర్ శర్మ వ్యాఖ్యానం అలరించింది.ఈ నాటి కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఆకు బత్తిని (గౌరి) శ్రీనివాస్, కార్యదర్శి తాటిపాముల వినోద్ కుమార్, సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం, సత్సంగ సభ్యులు, మాతలు, భక్తులు, ఆలయ కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.





## ఫిట్నెస్ లేని బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు

**జిల్లా రవాణా శాఖాధికారి వంశిధర్**

**జగిత్యాల జిల్లాలో రవాణా శాఖ అధికారుల తనిఖీలు**



జగిత్యాల జూన్ 14 (ప్రజామంటలు):

ఫిట్నెస్ లేని స్కూల్, కాలేజి బస్సులు రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటామని జగిత్యాల జిల్లా రవాణా శాఖాధికారి వంశీధర్ హెచ్చరించారు. ఫిట్నెస్ లేని ప్రయివేట్ స్కూల్, కాలేజి బస్సులను శు క్రవారం అధికారులు తనిఖీ చేశారు. బస్సు ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ కిట్లను అధికారులు తనిఖీ చేశారు. ఫిట్నెస్ లేని స్కూల్, కాలేజ్ బస్సులు తనిఖీ చేసి ఫిట్నెస్ లేని మూడు స్కూల్ బస్సులను సీజ్ చేశారు.

ఈసందర్భంగా వంశీధర్ మాట్లాడుతూ....

జగిత్యాల జిల్లాలో 470 స్కూల్ , కాలేజ్ బస్సులకు గాను 320 బస్సులు మాత్రమే ఫిట్నెస్ కలిగి ఉన్నాయని మిగతా150 బస్సులు ఫిట్నెస్ చేయించుకోవాలని యజమానులకు సూచించారు. ఇందులో ఏమైనా బస్సులు స్క్రాప్ కు వెళ్లాయాఇంకా ఎన్ని బస్సులు ఉన్నాయో సమాచారం ఇవ్వాలని యాజమాన్యాలకు నోటీసులు ఇచ్చామని డిటిఓ తెలిపారు. ఫిట్నెస్ లేని స్కూల్, కాలేజ్ బస్ లు నడిపి పిల్లల జీవితాలతో ఆటలాడుకోవద్దని చెబుతూ వెంటనే ఫిట్నెస్ చేయించుకోవాలని జిల్లా రవాణా శాఖాధికారి వంశిధర్ అన్నారు.